


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 229 | సోమవారం 24 - 08 -2026 | పేజీలు : 12 | వెల-3


## పట్టణాలకు కొత్త రూపు



# ఏపీ లిక్కర్ రవాణా స్కాం

## మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్ట్

- ఏపీ మద్యం రవాణా కుంభకోణంలో మాజీ మంత్రి కారుమూరి అరెస్ట్
- హైదరాబాద్ కొండాపూర్‌లో అదుపులోకి తీసుకున్న ఈడీ అధికారులు
- ఇప్పటికే కారుమూరి కుమారుడితో సహా ముగ్గురిని అరెస్ట్ చేసిన దర్యాప్తు సంస్థ
- రూ.195 కోట్లకు పైగా ఖజానాకు నష్టం జరిగిందని ప్రధాన ఆరోపణ
- ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో తప్పని అరెస్ట్

2లో



# శ్రీలంకపై పడిక్కల్ హవా..

## వరుసగా రెండో టెస్టులోనూ సెంచరీ

- శ్రీలంకతో రెండో టెస్టులోనూ సెంచరీ చేసిన దేవదత్ పడిక్కల్
- 73 ఓవర్లలో భారత్ స్కోరు 271/3
- అర్ధశతకంతో రాణించిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్
- జడేజాతో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన పడిక్కల్
- తొలి టెస్టులోనూ 167 పరుగులతో భారీ సెంచరీ చేసిన పడిక్కల్

2లో





# నర్సింగ్ కాలేజీలో ఫైటింగ్..

2లో

- సెల్‌ఫోన్ పోయిందన్న ఫిర్యాదుతో మొదలైన వివాదం
- రోడ్డుపైకి వచ్చి దాడి చేసుకున్న ఏపీ, మణిపూర్ విద్యార్థినులు
- అధికారుల జోక్యంతో సద్దుమణిగిన గొడవ
- మణిపూర్ విద్యార్థినులను మరో హాస్టల్‌కు తరలింపు



## రాహుల్ గాంధీకి దమ్ముంటే తెలంగాణలో 'ఛత్రోంకీ గూంజ్' పెట్టాలి

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి దమ్ముంటే తెలంగాణలో ఛత్రోంకీ గూంజ్ పెట్టాలని ఆ రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్. రామచందర్ రావు సవాల్ విసిరారు. తెలంగా ణకు రావాలని రాహుల్ గాంధీని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణకు రాహు ల్ గాంధీని ఒక్క విద్యార్థి కూడా రానివ్వ దని అన్నారు. తెలంగాణలో అడుగుపెడితే రాహుల్ గాంధీని విద్యార్థులే అడ్డుకుంటారని తెలిపారు. గతంలో హైదరాబాద్‌కు మిగతా12లో

# సమ్మె వద్దు... సమస్యలు పరిష్కరిస్తాం



- అర్ధరాత్రి నుంచి తలపెట్టిన బంద్‌ను విరమించాలని ఆటో డ్రైవర్లకు మంత్రి పొన్నం విజ్ఞప్తి
- ఛార్జీల సవరణపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ
- ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని వెల్లడి

### ఆటో, క్యాబ్ డ్రైవర్లకు మంత్రి పొన్నం భరోసా

ఇవాళ అర్ధరాత్రి నుంచి తలపెట్టిన నిరవధిక బంద్ ను విరమించుకోవాలని ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్లకు తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశా రు. సమ్మెల ద్వారా సమస్యలు పరిష్కారం కావని, చర్చలతోనే సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం

మిగతా2లో



## తెలంగాణలో విద్యార్థులకు ఏటా రూ.12,000..

2

- జాతీయ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు గడువు రేపటితో ముగింపు
- ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.1,000 చొప్పున నాలుగేళ్ల పాటు ఆర్థిక సహాయం

# హర్మూజ్ జలసంధి మాదే






- హర్మూజ్ జలసంధిని అమెరికా కొత్త భూభాగంగా అభివర్ణించిన ట్రంప్
- మ్యాప్ సహా సోషల్ మీడియాలో సంచలన పోస్ట్ చేసిన అమెరికా అధ్యక్షుడు
- ట్రంప్ వ్యాఖ్యలను భ్రమలుగా కొట్టిపారేసిన ఇరాన్

అగ్రరాజ్యం అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యా యి. ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన హ ర్మూజ్ జలసంధిని 'అమెరికా కొత్త భూభాగం'గా అభివర్ణిస్తూ అమెరికా మిగతా2లో



## విశాఖ వేదికగా 'బ్రిక్స్' క్రీడా తీర్మానం..

- విశాఖపట్నంలో ముగిసిన బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశం
- క్రీడల్లో పరస్పర సహకారానికి సభ్య దేశాల ఉమ్మడి ప్రకటన
- క్రీడా ఉత్పత్తుల తయారీ, సంప్రదాయ క్రీడలపై భారత్ కీలక ప్రతిపాదనలు

# బంగాళాఖాతంలో అల్పపీడనం..

ఉత్తరాంధ్రకు వర్ష సూచన, మత్స్యకారులకు హెచ్చరిక



- వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం
- ఉత్తరాంధ్రలో నేడు, రేపు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం
- తీరం వెంబడి గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని విపత్తుల సంస్థ హెచ్చరిక

2లో

వాయువ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీ డనం ఏర్పడినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ) వెల్లడించింది. దీని ప్రభావంతో ఉత్తరాంధ్రలో నేడు, రేపు పలుచోట్ల మోస్తరు నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని

## ప్రభుత్వ పాఠశాలలపై కూటమిది అబద్ధాల ప్రచారం

కూటమి ప్రభుత్వంపై మాజీ సీఎం జగన్ తీవ్ర విమర్శలు

2లో



# రేపు ఏలూరు జిల్లాలో చంద్రబాబు పర్యటన..

- సోమవారం ఏలూరు జిల్లాలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు
- ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో కలిసి కొత్త విత్తన రకం ఆవిష్కరణ
- దేశంలోనే తొలి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ మొక్కజొన్న వంగడం ఇదే
- ముసునూరులోని గోర్మే పాప్‌కార్నికా ప్లాంట్‌లో ఈ కార్యక్రమం
- వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ఈ ప్రయోగం లక్ష్యం

2లో



ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు (ఆగస్టు 24) ఏలూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో కలిసి దేశంలోనే మొట్టమొదటి నాన్-జీఎంఓ (జన్యుపరంగా మార్పు చేయని) పాప్‌కార్న్ మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాన్ని ఆయన ఆవిష్కరిస్తారు. ఏలూరు జిల్లా ముసునూరులోని గోర్మే పాప్‌కార్నికా సంస్థ ప్రాంగణంలో

# నిధులున్నా.. నిర్లక్ష్యం

- మొదలుకాని నర్సీపట్నం- తుని రోడ్డు అభివృద్ధి పనులు
- రూ.7.2 కోట్లు మంజూరు చేయించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- గత ఏడాది డిసెంబరులో భూమి పూజ
- ఎనిమిది నెలలుదాటినా పనులు ప్రారంభించని కాంట్రాక్టర్
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు
- గోతులతో వాహనదారులు, ప్రయాణికుల ఇక్కట్లు

2లో



దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించ లేదు అన్న చందంగా తయారైంది నర్సీపట్నం- తుని ప్రధాన రహదారి పరిస్థితి. ఈ రోడ్డు అభివృద్ధికి శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నిధులు మంజూరు చేయించినప్పటికీ...

## రేపు ఏలూరు జిల్లాలో చంద్రబాబు పర్యటన..

ఈ కార్యక్రమం జరగనుంది. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలనే లక్ష్యంతో ఈ ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. రైతులు పండించిన పంటకు విలువ జోడించి, ప్రాసెసింగ్, బ్రాండింగ్‌తో మార్కెట్‌కు తరలించడం ద్వారా వారి ఆదాయం పెంచాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఈ క్రమంలో ముసునూరు వేదికగా జరగనున్న ఈ కార్యక్రమం ప్రాధాన్యత సంతరించుకుంది. గోర్మే పాప్‌కార్న్‌కా సంస్థ ఆధ్వర్యంలో ఈ కొత్త వంగడాన్ని అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఈ సంస్థ దేశవ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పాప్‌కార్న్ మొక్కజొన్నను సాగు చేస్తూ, వేలాది మంది రైతులతో భాగస్వామ్యం కలిగి ఉంది. ముసునూరులో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్, ఆసియాలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ కేంద్రాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. దేశంలోని వేలాది సినిమా థియేటర్లకు పాప్‌కార్న్ సరఫరా చేయడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోంది.

**సీఎం పర్యటన వివరాలు** సీఎం చంద్రబాబు సోమవారం ఉదయం 9:55 గంటలకు తన క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి, 10:15 గంటలకు ముసునూరు మండలం కాట్రేనిపాడుకు చేరుకుంటారు. ఉదయం 10:45 గంటలకు గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు స్వాగతం పలుకుతారు. అనంతరం ఉదయం 11 గంటలకు జరిగే హైబ్రిడ్ మొక్కజొన్న విత్తన ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం ముగిశాక, మధ్యాహ్నం 1:20 గంటలకు తిరిగి రాష్ట్ర సచివాలయానికి చేరుకుంటారు.

## నిధులున్నా.. నిర్లక్ష్యం

టెండర్ ద్వారా పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టడం లేదు. దీంతో నర్సీపట్నం- తుని రోడ్డులో పలుచోట్ల ఏర్పడిన గోతులతో వాహనదారుల తీవ్ర అవస్థలు పడుతున్నారు. నర్సీపట్నం- తుని ప్రధాన రహదారి నిర్వహణను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది. ఒక్క ఏడాది కూడా నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో క్రమేపీ గోతులు ఏర్పడి ఛిద్రమైంది. అనకాపల్లి జిల్లా పరిధిలో నర్సీపట్నం అగ్నిమాపక కేంద్రం నుంచి నాతవరం మండలం శృంగవరం వరకు రోడ్డుపై చాలాచోట్ల పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. కనీసం గోతులను కూడా పూడ్చకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు రాత్రిపూట ప్రమాదాలకు గురవుతున్నారు. శారదానగర్ నుంచి బలిఘట్టం ఊర్లోకి మలుపు తిరిగే మార్గంలో, బలిఘట్టం చెక్‌పోస్టు నుంచి తలుపుమ్మ గుడి వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చొరవ తీసుకొని నర్సీపట్నం అగ్నిమాపక కేంద్రం నుంచి నాతవరం మండలం శృంగవరం వరకు 17 కిలోమీటర్ల మేర రోడ్డు అభివృద్ధి పనులకు రూ.7.2 కోట్లు మంజూరు చేయించారు. తరువాత అధికారులు టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. గత ఏడాది డిసెంబరులో రోడ్డు పనులు మొదలు పెట్టించడానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో భూమి పూజ చేయించారు. ఇది జరిగి ఎనిమిది నెలలు దాటినప్పటికీ కాంట్రాక్టర్ రోడ్డు పనులు మొదలు పెట్టలేదు. అగ్రిమెంట్ ప్రకారం నిర్ణీత గడువులోగా పనులు మొదలు పెట్టకపోతే టెండర్‌ను రద్దు చేసే అధికారం అధికారులకు వుంది. కానీ కాంట్రాక్టర్‌కు నోటీసు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. దీనిపై అధికారులను వివరణ కోరితే.. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా తారు ధరలు బాగా పెరిగిపోయాయని, రేట్లు తగ్గితే కాంట్రాక్టర్ పనులు మొదలు అంటున్నారు. ఆర్అండ్‌బీతో అగ్రిమెంట్ చేసుకున్న తర్వాత నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదల/ తగ్గుదలతో సంబంధం లేకుండా కాంట్రాక్టర్ పనులు చేయాలి. కానీ నర్సీపట్నం- తుని రోడ్డు పనులు చేపట్టని కాంట్రాక్టర్ విషయంలో అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారు. వర్షం పడినప్పుడు గోతుల్లో నీరు చేరి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

## ఖర్గే వద్ద కొండా సురేఖ పంచాయితీ!



తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వద్దకు చేరింది. ఆదివారం బెంగళూరులో ఖర్గేతో మంత్రి సురేఖ సమావేశమైనట్టు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి రావడానికి ఒక్కరోజు ముందు ఈ భేటీ జరగడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీలో అంతర్గతంగా ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో సురేఖ నేరుగా అధిష్ఠానాన్ని కలవడం చర్చనీయాంశమైంది. సుమారు 15 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో కొండా సురేఖ తన వాదనను ఖర్గే ముందు వినిపించినట్లు సమాచారం. తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గానీ, కాంగ్రెస్ పార్టీకి గానీ, గాంధీ కుటుంబానికి గానీ వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని ఆమె వివరించారు. పార్టీలోని కొందరు నేతలు తనను లక్ష్యంగా చేసుకుని, మంత్రివర్గం నుంచి తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారని, దీనిపై విచారణ చేపట్టాలని ఆమె ఖర్గేను కోరినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఖర్గే స్పందిస్తూ.. పార్టీకి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా మాట్లాడటం సరైన పద్ధతి కాదని సురేఖకు స్పష్టం చేసినట్లు సమాచారం. టికెట్ల కేటాయింపు, అభ్యర్థుల ఎంపిక పూర్తిగా ఏఐసీసీ ఎన్నికల కమిటీ పరిధిలోని అంశమని, వాటిపై ఏకపక్ష ప్రకటనలు చేయకూడదని ఆయన హితవు పలికినట్లు తెలిసింది. కొండా సురేఖ కుమార్తె సుష్మిత.. సీఎం రేవంత్ రెడ్డి, పరకాల టికెట్‌పై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పీసీసీ క్రమశిక్షణ సంఘం నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సురేఖ, ఆమె కుమార్తెపై కఠిన చర్యలు తీసుకోవాలని 20 మందికి పైగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసే ప్రయత్నాలు ఫలించకపోవడంతోనే ఆమె నేరుగా ఖర్గేను కలిసినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## రేవంత్ రాకతో తెలంగాణలో పొలిటికల్ హీట్..



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన లండన్ పర్యటన ముగించుకుని కొద్దిసేపటి క్రితం హైదరాబాద్ చేరుకున్నారు. అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం రాజకీయ అనుమతి నిరాకరించడంతో ఆయన తన పర్యటనను కుదించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఆయన రాష్ట్రానికి దూరంగా ఉన్న సమయంలో పార్టీలో చెలరేగిన 'కొండా ఎపిసోడ్' తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో సీఎం రాక, సాయంత్రం జరగబోయే మీడియా సమావేశంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టు 20న యూకే, యూఎస్ పర్యటనల కోసం ఢిల్లీ నుంచి లండన్ వెళ్లారు. అక్కడ ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయాలతో పాటు లండన్ బిజినెస్ స్కూల్‌ను సందర్శించారు. పలువురు పారిశ్రామికవేత్తలు, ప్రవాస తెలుగువారితో సమావేశమై రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా చర్చలు జరిపారు. అయితే, ఆయన అమెరికా పర్యటనకు విదేశాంగ శాఖ అనుమతి నిరాకరించింది. ఈ నిర్ణయం తనను షాక్‌కు గురిచేసిందని లండన్‌లోనే స్పందించిన సీఎం, యువత భవిష్యత్తు కోసం రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని కేంద్రానికి సూచించారు. ఇదే సమయంలో తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపాయి. పరకాల నియోజకవర్గంలో జరిగిన ఓ కార్యక్రమంలో, ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే వచ్చే ఎన్నికల్లో మద్దతిస్తానన్న సీఎం ప్రకటనను సుష్మిత బహిరంగంగా సవాల్ చేశారు. "రేవంత్ రెడ్డి వచ్చినా, ఆయన తాత వచ్చినా పరకాలలో పోటీ చేసి గెలిచేది నేనే" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారంపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ తీవ్రంగా స్పందించి, మంత్రి కొండా సురేఖకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది. ఈ రెండు కీలక పరిణామాల మధ్య సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌కు చేరుకోవడంతో అందరి దృష్టి ఆయన స్పందనపైనే కేంద్రీకృతమైంది. సాయంత్రం జరగనున్న మీడియా సమావేశంలో అమెరికా పర్యటన రద్దు వెనుక కారణాలు, కొండా కుటుంబం వివాదంపై సీఎం ఏం మాట్లాడతారన్నది ఆసక్తికరంగా మారింది.

## సాహిత్యం నగరాలకు పరిమితం కాకూడదు!

మానవ సంబంధాల వెనుక ఉండే ఆర్ద్రతను, పల్లె వాతావరణంలోని సునిశిత శబ్దాలను కవిత్వంగా మార్చడంలో సుంకర గోపాల్ ముద్ర ఎంతో ప్రత్యేకం. తొలి కవితా సంపుటి 'మా నాయన పాట' ద్వారా కవిత్వ ప్రేమికుల, విమర్శకుల ప్రశంసలు అందుకున్నారాయన. బోధన, సృజన వరకే కాకుండా పాఠకుల్లో కొత్త నీరును తేవటానికి కూడా గోపాలయ్య ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల ఆయన రెండవ కవితా సంపుటి 'నీటి కుండలాంటి మనిషి' విడుదలైన సందర్భంగా ఆయనతో ఇంటర్వ్యూ:

**మీ కవిత్వంలో గ్రామీణ, సామాన్య జీవిత వస్తువులే అధికం. దీనికి మీ నేపథ్యమే మూలమా?**

కచ్చితంగా. మనిషి వేళ్లు ఎక్కడైతే పాతుకుపోయి ఉంటాయో, అక్కడి నుండే సారాన్ని గ్రహిస్తాడు. నా కవిత్వంలో కనిపించే మట్టివాసన, గ్రామీణ వస్తువులు నేను పుట్టి పెరిగిన నేల నుంచి వచ్చినవే. బాల్యంలో అపురూపమైన గ్రామీణ జీవితం గడిపాను. చెమట చుక్కల విలువ తెలుసు. పల్లెల్లోని సహజమైన అనుబంధాలు ఆలోచనలకు పునాదులు. అవే నా కవిత్వానికి ప్రాణం పోశాయి.

'మా నాయిన పాట', 'నీటి కుండలాంటి మనిషి' ఈ రెండు కవిత్వ సంపుటాల మధ్య కాలంలో రచయితగా మీలో మీరు గమనించిన మార్పులు?

నా మొదటి కవిత్వ సంపుటి 'మా నాయిన పాట'లో ఒక రకమైన భావోద్వేగం, నాటి జ్ఞాపకాల పట్ల మమకారం ఎక్కువగా ఉంటే, రెండో సంపుటి 'నీటి కుండలాంటి మనిషి' నాటికి నాలో ఒక తాత్విక పరిణతి చోటు చేసుకుంది. మానవ జీవితం నీటి కుండలా ఎంత సున్నితమైనదో, ఎంత అశాశ్వతమైనదో గ్రహించిన అనుభవం అది. రూపంలోనూ, వ్యక్తీకరణలోనూ మరింత స్పష్టత, గాఢత పెరిగాయని భావిస్తున్నాను. చాలా సరళమైన భాషలో లోతైన భావాల ఆవిష్కరణ గమనించవచ్చు. ఈ సంపుటిలో ప్రకృతి, సమాజం, జీవితం ఈ త్రికం పట్ల అన్వేషణ కనిపిస్తుంది.

**సాహిత్యవ్యాప్తి కోసం మారుమూల పాఠశాలలకు, కళాశాలలకు వెళ్తుంటారు. దీని వెనక మీ దృక్పథం?**

సాహిత్యం కేవలం నగరాలకో, పెద్ద సభలకో పరిమితం కాకూడదు. నిజమైన చైతన్యం క్షేత్రస్థాయి నుంచి రావాలి. గ్రామీణ విద్యార్థుల్లో అద్భుతమైన సృజనాత్మకత ఉంటుంది. కానీ సరైన మార్గదర్శకత్వం అందదు. ముఖ్యంగా నేను డిగ్రీ పాఠ్యప్రణాళిక రూపొందించే క్రమంలో కవిత్వ ప్రచారం కోసం కార్యశాలలు నిర్వహించాలని పాఠ్యపుస్తకంలో పొందుపరిచాను. తరగతి గదుల్లో సాహిత్యాన్ని విద్యార్థులకు చేరువ చేయడంలో మనం విఫలం అయ్యామనే చెప్పాలి. కనీసం తమ జిల్లాల్లో ఉన్న రచయితల పేర్లు కూడా విద్యార్థులకు తెలియజేయడం లేదు. చదువులో మార్కులు బయటకు కనిపిస్తాయి గానీ సాహిత్యం నుంచి వచ్చే సంస్కారం చాలా నిదానంగా కనిపిస్తుంది. సాహిత్యాన్ని ప్రచారం చేయాలి, విద్యార్థుల ఆసక్తిని పెంపొందించాలి అనే ఉద్దేశంతో కళాశాలలు తిరుగుతున్నాను.

**సాహిత్యం పట్ల ఒక గ్లామర్ తీసుకొస్తేనే నేటి 'జెన్ జీ' యువత ఆకర్షితులు అవుతారంటారా?**

నేటి యువతకు భాషను భారంగా కాకుండా, ఒక అనుభూతిగా అందించాలి. డిజిటల్ యుగంలో ఉన్న వారికి 'రీల్' జీవితానికి, 'రియల్' జీవితానికి మధ్య ఉన్న తేడాను కవిత్వం ద్వారా విడమర్చి చెప్పాలి. తరగతి గదిలో సాహిత్యం గురించి చెప్పేటప్పుడు అది వారి నిత్య జీవితానికి ఎలా అన్వయించుకోవాలో వివరిస్తే, వారు తప్పకుండా ఆకర్షితులవుతారు. ఆధునిక మాధ్యమాలను వాడుకుంటూనే క్లాసిక్ సాహిత్యంలోని గొప్పతనాన్ని రుచి చూపాలి.

**ఇతర ప్రక్రియల జోలికి పోకుండా కేవలం కవిత్వం దగ్గరే ఉండటానికి కారణం?**

మా నాన్నగారు జానపద గాయకులు కావడం వల్ల చిన్నప్పుడే నా చెవుల్లో 'లయ' నిలిచిపోయింది. జానపదం అనేది కవిత్వానికి తల్లి లాంటిది. ఇతర ప్రక్రియల కంటే కవిత్వం మన భావాలను తక్కువ మాటల్లో, ఎక్కువ ప్రభావంతో వ్యక్తపరచడానికి సహకరిస్తుంది. కవిత్వంతోపాటు వ్యాసాలు, సాహిత్య విశ్లేషణలు చేస్తా కానీ ఎప్పుడూ కవిత్వంలోనే సేద తీరుతాను.

నేడు అందరికీ వెసులుబాటు ఉన్న సోషల్ మీడియా వంటి మాధ్యమాల్లో రచయితలు తాము రాసిందే కవిత్వం అనుకొనే అవకాశం ఎక్కువ. దీన్ని ఎలా ఎదుర్కోవాలి?

సోషల్ మీడియా అందరికీ వేదికను ఇచ్చింది, మంచిదే. కానీ అకవిత్వం, ప్రాథమిక లక్షణాలు లేని రచనలు ప్రచారంలోకి రావడం ఆందోళనకరం. దీన్ని ఎదు ర్కోవాలంటే నాణ్యమైన సాహిత్యం వైపు పాఠకులను మళ్లించాలి. నిరంతర పఠనం, అధ్యయనం ఉన్న పాఠకుడిని ఏ సూడో రచయితా మోసం చేయలేడు. ఇప్పుడు చాట్ జిపిటి ఆధారంగా కొంతమంది వ్యాసాలు రాయడం కూడా మొదలుపెట్టారు. అయితే ఆ భాషను మనం సులభంగా పట్టుకోవచ్చు.

యువ రచయితల సాహిత్యంపై ఆశించినంత విమర్శ రావడంలేదు. దీనివల్ల కూడా వాళ్ళు తాము రాసిందే సాహిత్యం అనుకొనే ప్రమాదం ఉంది కదా?

నిజమే. ప్రస్తుతం విమర్శకుల సంఖ్య తగ్గడం వల్ల లేదా మొహమాటాల వల్ల లోతైన విశ్లేషణలు రావడం లేదు. దీనివల్ల యువ రచయితలు తమ లోపాలను సరిదిద్దుకునే అవకాశం కోల్పోతున్నారు. విమర్శ అంటే తిట్టడం కాదు, ఒక రచనలోని గుణదోషాలను నిర్మొహమాటంగా విశ్లేషించడం. యువ కవులు కూడా విమర్శను ఆహ్వానించే సంస్కారాన్ని అలవరుచుకోవాలి. అయితే 'కవి సంగమం' వేదికగాను వివిధ పత్రికల్లోనూ వస్తున్న వ్యాసాలను పూర్తిగా ఎవరూ చదవడం లేదు. విమర్శ లేదు, విమర్శకులు లేరు అనే ఒక్క మాటతో కొట్టి పారేయడం భావ్యం కాదు. నా మేరకు నేను ఒక వ్యాసం రాసినప్పుడు కచ్చితంగా అందులో కొన్ని పరిశీలనలు చేస్తాను. కొన్ని సూచనలు కూడా చేస్తాను. లోపాలను కూడా సంస్కారవంతమైన భాషలోనే చెప్తాను.

## గూగుల్ ఫైర్‌బేస్ అడ్డాగా సైబర్ మోసాలు..
## 57 వెబ్‌సైట్లపై కేంద్రం వేటు

సైబర్ నేరగాళ్లు తమ మోసాలకు ఇప్పుడు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. టెక్నాలజీ దిగ్గజం గూగుల్‌కు చెందిన ప్రముఖ క్లౌడ్ సర్వీస్ 'ఫైర్‌బేస్' ప్లాట్‌ఫామ్‌నే తమ అడ్డాగా మార్చుకుని భారీ ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నట్లు భారత సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (×4జ) గుర్తించింది. ఈ నేపథ్యంలో, మోసపూరిత కార్యకలాపాలకు వేదికగా మారిన దాదాపు 57 వెబ్‌సైట్లు, డేటాబేస్‌లను తక్షణమే తొలగించాలని కేంద్ర ప్రభుత్వం గూగుల్‌ను ఆదేశించింది.

**నకిలీ వెబ్‌సైట్లతో దాడులు ఎలా?** సైబర్ నేరగాళ్లు గూగుల్ ఫైర్‌బేస్ ద్వారా వెబ్‌సైట్లను హోస్ట్ చేసి, వాటిని అచ్చం ప్రముఖ బ్యాంకులు, ఇతర విశ్వసనీయ సంస్థల వెబ్‌సైట్లలాగే రూపొందిస్తున్నారు. ముఖ్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ూదీ×), ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంక్ వంటి బ్యాంకుల పేర్లతో నకిలీ పేజీలను సృష్టించి వినియోగదారులను తప్పుదారి పట్టిస్తున్నారు. ఈ నకిలీ వెబ్‌సైట్లను చూసి నిజమైనవిగా భ్రమపడిన వినియోగదారులు తమ క్రెడిట్ కార్డ్ వివరాలు, వన్-టైమ్ పాస్‌వర్డ్ (ూ్ఖూ) వంటి అత్యంత సున్నితమైన సమాచారాన్ని నమోదు చేసి మోసపోతున్నారు.

**అసలేంటి ఈ ఫైర్‌బేస్?** ఫైర్‌బేస్ అనేది గూగుల్ అందించే ఒక క్లౌడ్ ఆధారిత డెవలప్‌మెంట్ ప్లాట్‌ఫామ్. మొబైల్ అప్లికేషన్లు, వెబ్‌సైట్లను సులభంగా, వేగంగా రూపొందించడానికి డెవలపర్లు దీనిని ఉపయోగిస్తారు. వెబ్‌సైట్ హోస్టింగ్, డేటా నిల్వ, యూజర్ అథెంటికేషన్ వంటి అనేక సేవలను ఇది రెడీమేడ్‌గా అందిస్తుంది. డెవలపర్లు ప్రతి అంశాన్ని మొదటి నుంచి నిర్మించుకునే శ్రమ లేకుండా ఇది సహాయపడుతుంది.

**మోసగాళ్ల వ్యూహం ఇదే..** విశ్వసనీయమైన గూగుల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఉపయోగించడం వల్ల ఈ నకిలీ వెబ్‌సైట్లు అనుమానాస్పదంగా కనిపించవు. ఉదాహరణకు, పీఎం-కిసాన్ పథకం కింద సాయం అందిస్తామంటూ నకిలీ వెబ్‌సైట్లను సృష్టించి, ప్రజలను నమ్మించి ఒక మాల్వేర్ అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. ఆ యాప్ ద్వారా బాధితుల ఫోన్లలోని విలువైన సమాచారాన్ని దొంగిలించి, దాన్ని ఫైర్‌బేస్‌లో ఉన్న తమ డేటాబేస్‌కు పంపుతున్నారు. ఇలా నకిలీ వెబ్‌సైట్, మాల్వేర్ యాప్, డేటాబేస్‌లతో కూడిన ఒక గొలుసుకట్టు వ్యవస్థను నేరగాళ్లు నిర్వహిస్తున్నారు. అయితే, ఇక్కడ సమస్య గూగుల్ ఫైర్‌బేస్ ప్లాట్‌ఫామ్‌ది కాదు, సైబర్ నేరగాళ్లు ఒక మంచి టెక్నాలజీని తమ స్వార్థానికి, మోసాలకు దుర్వినియోగం చేయడమే అసలు సమస్య. ఐ4సీ పంపిన నోటీసుల ఆధారంగా భారత ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. ఈ దాడుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు.



## ఏపీ లిక్కర్ రవాణా స్కాం: మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్ట్

ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆదివారం అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్ట్ కాగా, తాజాగా కారుమూరి అరెస్ట్‌తో దర్యాప్తు కీలక దశకు చేరుకుంది.ఇటీవల కారుమూరి నాగేశ్వరరావు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. జూలై 29న ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ స్కామ్ విలువ రూ.350 కోట్లకు పైగా ఉందని వ్యాఖ్యానిస్తూ, కస్టోడియల్ విచారణ అవసరమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే ఈడీ అధికారులు కారుమూరిని అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది.

**ఏమిటీ మద్యం స్కామ్?** గత ప్రభుత్వ హయాంలో ఏపీలో మద్యం రవాణా టెండర్ల ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయన్నది ప్రధాన ఆరోపణ. టెండర్ నిబంధనలను ఉద్దేశపూర్వకంగా మార్చి, సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్స్ వంటి సంస్థలకు అనుకూలంగా వ్యవహరించారని ఈడీ తన దర్యాప్తులో గుర్తించింది. మార్కెట్ రేట్ల కన్నా ఎక్కువ ధరకు కాంట్రాక్టులు కట్టబెట్టడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.195.33 కోట్ల నష్టం వాటిల్లినట్లు ఏపీ సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ విచారణ కొనసాగిస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో రాజ్ కెసిరెడ్డి, అప్పటి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి కీలకపాత్ర పోషించినట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఈ సిండికేట్‌లో మాజీ మంత్రి కారుమూరి, ఆయన కుమారుడు సునీల్ కుమార్‌కు కూడా వాటా ఉందని, వారి కుటుంబానికి సుమారు రూ.10 కోట్లకు పైగా ముడుపులు అందినట్లు దర్యాప్తు సంస్థ అనుమానిస్తోంది. ఈ కేసులో భాగంగా జూన్ నెలలో ఈడీ విస్తృతంగా తనిఖీలు చేపట్టింది. మొదట రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలను అరెస్ట్ చేసింది. అనంతరం కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్ కుమార్‌ను కూడా అదుపులోకి తీసుకుంది. ఇప్పుడు మాజీ మంత్రి కారుమూరిని కూడా అరెస్ట్ చేయడంతో ఈ కేసు దర్యాప్తు మరింత వేగవంతం కానుంది.

## శ్రీలంకపై పడిక్కల్ హవా..

శ్రీలంకతో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో 167 పరుగుల భారీ శతకంతో ఆకట్టుకున్న పడిక్కల్, కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్టులోనూ సెంచరీతో కదం తొక్కాడు. అతని అద్భుత ఇన్నింగ్స్ సాయంతో, తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత జట్టు పటిష్ఠ స్థితిలో నిలిచింది. కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో నేడు ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఓపెనర్లుగా బరిలోకి దిగిన యశస్వి జైస్వాల్ (45), కేఎల్ రాహుల్ (18) మోస్తరు స్కోర్లు సాధించారు. జైస్వాల్ దూకుడుగా ఆడినా, భారీ స్కోరు చేయలేకపోయాడు. రాహుల్ మరోసారి నిరాశపరిచాడు. కేవలం 66 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును పడిక్కల్ ఆదుకున్నాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి పడిక్కల్ కీలకమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 120 పరుగులు జోడించారు. ఈ క్రమంలో గిల్ (50) బాధ్యతాయుతమైన అర్ధశతకం పూర్తి చేసుకోగా, పడిక్కల్ తన క్లాస్ బ్యాటింగ్‌తో అలరించాడు. గిల్ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన రిషభ్ పంత్ (3) గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. అనంతరం రవీంద్ర జడేజాతో కలిసి పడిక్కల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ప్రస్తుతం పడిక్కల్ 185 బంతుల్లో 12 ఫోర్లతో 111 పరుగులు, జడేజా 45 బంతుల్లో 31 పరుగులతో క్రీజులో ఉన్నారు. వీరిద్దరూ అప్పటికే అజేయంగా 64 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. భారత్ 73 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 271 పరుగులు చేసి భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. శ్రీలంక బౌలర్లలో అసిత్ ఫెర్నాండో రెండు వికెట్లు తీయగా, లహిరు కుమార ఒక వికెట్ పడగొట్టాడు.

## నర్సింగ్ కాలేజీలో ఫైటింగ్..

ఓ సెల్‌ఫోన్ వ్యవహారం నర్సింగ్ విద్యార్థినుల మధ్య పెద్ద ఘర్షణకు దారితీసింది. కాకినాడలోని ఎస్కే కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో చదువుకుంటున్న ఆంధ్రప్రదేశ్, మణిపూర్ రాష్ట్రాలకు చెందిన విద్యార్థినులు రోడ్డుపైకి వచ్చి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. అధికారుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది.వివరాల్లోకి వెళితే.. కళాశాల హాస్టల్‌లో ఉంటున్న మణిపూర్‌కు చెందిన ఓ విద్యార్థిని తన సెల్‌ఫోన్ కనిపించడం లేదని ఇటీవల సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత ఫోన్ దొరికినప్పటికీ, ఈ విషయంపై విద్యార్థినుల మధ్య వివాదం సద్దుమణగలేదు. మాటామాటా పెరిగి పరిస్థితి తీవ్రరూపం దాల్చింది. రెండు వర్గాల విద్యార్థినులు హాస్టల్ నుంచి బయటకు వచ్చి రోడ్డుపైనే ఘర్షణకు దిగారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ దాడిలో పలువురు విద్యార్థినులకు స్వల్ప గాయాలవగా, ఇద్దరిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే కళాశాల వద్దకు చేరుకున్నారు. ఆర్డీవో, ట్రైనీ జేసీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కూడా సంఘటనా స్థలానికి వచ్చి విద్యార్థినులతో మాట్లాడారు. వారికి నచ్చజెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అధికారులు తక్షణ చర్యగా మణిపూర్‌కు చెందిన విద్యార్థినులను వేరే హాస్టల్‌కు తరలించారు. ఈ ఘటన నేపథ్యంలో అసలు కళాశాలకు సరైన అనుమతులు ఉన్నాయా, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు ఎలా ఉన్నాయి అనే కోణంలో అధికారులు విచారణ ప్రారంభించారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం..

సూచించింది. పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ తెలిపింది. సముద్రం అలజడిగా ఉండి, కెరటాలు ఎగసిపడే ప్రమాదం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది. ఐఎండీ నివేదిక ప్రకారం, ఆగస్టు 23, ఆదివారం ఉదయం నాటికి ఈ అల్పపీడనం వాయువ్య బంగాళాఖాతంలోనే స్థిరంగా కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. రుతుపవన ద్రోణి కూడా ఈ అల్పపీడన ప్రాంతం మీదుగా కొనసాగుతుండటంతో దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు, అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

## ప్రభుత్వ పాఠశాలలపై కూటమిది అబద్ధాల ప్రచారం: జగన్

ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యా రంగంపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు భారీగా తగ్గిపోతున్నారని, కూటమి ప్రభుత్వం మాత్రం అబద్ధపు ప్రచారాలు చేసుకుంటోందని విమర్శించారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడైస్ ప్లస్ (ఖఌ×ూజు+) గణాంకాలను ఉటంకిస్తూ సోషల్ మీడియా వేదికగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేటు పాఠశాలల నుంచి 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారని ప్రచారం చేసుకోవడంపై జగన్ మండిపడ్డారు. ఇది వాస్తవమైతే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి కదా? అని ప్రశ్నించారు. కానీ, యూడైస్ గణాంకాల ప్రకారం 2023-24 విద్యా సంవత్సరంతో పోలిస్తే, 2025-26 నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 40,50,116 నుంచి 34,93,450కి పడిపోయిందని, అంటే ఏకంగా 5,56,666 మంది విద్యార్థులు తగ్గిపోయారని జగన్ పేర్కొన్నారు. ఇదే సమయంలో ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 45,53,380 నుంచి 48,40,296కు పెరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల సంఖ్య కూడా 45 వేల నుంచి 44,222కు తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీకి నారాయణ, శ్రీచైతన్య వంటి కార్పొరేట్ విద్యా సంస్థలతో ఉన్న సంబంధాల కారణంగానే, ప్రభుత్వ విద్యా వ్యవస్థను ఉద్దేశపూర్వకంగా బలహీనపరుస్తున్నారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. తద్వారా ప్రైవేటు సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం బాటలు వేస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. తమ హయాంలో విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చామని జగన్ గుర్తుచేశారు.

# నాన్న గారికి ఇంత ఆస్తి ఉందని నాకు ఇంత వరకూ తెలియదమ్మా

వాళ్లిద్దరూ మంచి స్నేహితులు. పెద్దయ్యారు..పెళ్ళిళ్ళు అయ్యాయి వాళ్లకు..ఒకరు గోవింద్ ..ఇంకొకరు శ్రీనాథ్.. ఇద్దరి పుట్టిన ఊరు బాసర.. అక్కడే చదువు, సంస్కారం నేర్చుకున్నారు.. ప్రస్తుతం హైదరాబాద్ లో ఉద్యోగం ఇద్దరికీ.. గోవింద్ స్కూల్ టీచర్. శ్రీనాథ్ కి సెక్రటేరియట్ లో ఉద్యోగం... ఏరా అంటే ఏరా అనే సాన్నిహిత్యం వాళ్ళది... జీవితం మాత్రం శ్రీనాథ్ ని కొంచెం డబ్బున్న వాడిగా మార్చింది..గోవింద్ పిల్లలకు చదువు చెప్పుకుంటూ టీచర్ గా ఉండి పోయాడు..అద్దె ఇల్లు, సిటీ బస్ ప్రయాణం మామూలు విషయం గోవింద్ కి..కానీ ఎప్పుడూ తన స్థితి కి బాధ పడలేదు.. పెళ్లయిన తరువాత చాలా మార్పులు వచ్చాయి వాళ్ళ జీవితాల్లో.గోవింద్ భార్య సరళ..పేదింటి అమ్మాయి.. గోవింద్ మేనమామ కూతురే.. అందలం ఎక్కాలని ఆశ సరళ కు..కానీ తీరేదెలా ? ఎప్పుడయినా సరళ హంగులు, ఆర్భాటాలు కావాలని అడిగితే నవ్వి ఊరుకునే వాడు గోవింద్.. మన దేశం లో నూటికి 40 మందికి ప్రతి రోజూ తిండి లేదు..వాళ్ళతో పోలిస్తే మనం నయమే కదా అంటాడు..పాపం సరళ కోరికలు తీర్చలేనందుకు కొంచెం బాధ పడుతూ ఉంటాడు అప్పుడప్పుడు..ఆడవాళ్లు తమ పక్కన వాళ్ళతో పోల్చుకుని తమ జీవితాలలో లేనివి ఏమిటో ఇట్టే తెలుసుకుంటారు... వాళ్లకు ఉన్న గొప్ప విషయాలను మాత్రం అంతగా పట్టించు కోరు.. ఇక్కడ కూడా అదే జరిగింది... సొంత ఇల్లు, సొంత కారు లేవని బాధ సరళకు.... శ్రీనాథ్ భార్య లక్ష్మి.. మంచి కుటుంబం నుండి వచ్చింది.. దాన ధర్మాలు చేయటం అలవాటు..దైవ భక్తి మెండుగా ఉంది...ఉన్న సంపద ను చూసి మిడిసి పాటు లేదు లక్ష్మికి... లక్ష్మి, సరళ కూడా స్నేహితులయ్యారు. ఇళ్లకు రాక పోకలు కూడా బాగానే ఉన్నాయి... లక్ష్మి కి సరళ అమాయకత్వం బాగా నచ్చుతుంది.. పిచ్చి పిల్ల.. సంపదలు ఉన్నా , సఖ్యం మరియు సౌఖ్యం ఉండాలి జీవితం లో ..అదే చెప్పింది చాలా సార్లు.. నువ్వెన్నయినా చెప్పు లక్ష్మీ... డబ్బులున్న దారే వేరు..చిన్న చిన్న అవసరాలు కూడా తీర్చుకోలేని జీవితాలు ఎందుకు ? ఎవరికి ఉపయోగ పడినట్లు..??

**రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచాయి.. నలుగురూ పెద్దవాళ్ళయ్యారు...**

అది ఆగస్ట్ నెల.. ఆ నెలలో శ్రీనాథ్ రిటైర్ అవుతున్నాడు...మరుసటి నెల సెప్టెంబర్ లో గోవింద్ రిటైర్మెంట్ .. ఆగస్ట్ 31 వ తారీకు రానే వచ్చింది..శ్రీనాథ్, లక్ష్మి ఇంటికి వచ్చి మరీ పిలిచారు.. రిటైర్మెంట్ ఫంక్షన్ కి రావాలని... పిలవక పోయినా గోవింద్ వెళ్ళేవాడే.. ఇప్పుడు సరళ కూడా వెంట వెళ్ళింది... శ్రీనాథ్ యూడీసీ గా రిటైర్ అయ్యాడు.. ఫంక్షన్ బాగా జరిగింది సెక్రటేరియట్ లో వాళ్ళ డిపార్ట్మెంట్ లో.. చాలా మంది శ్రీనాథ్ ని మెచ్చుకున్నారు..మంచి వాడు.. పని లో చురుకుదనం చూపించే వాడని.. అతను రిటైర్ అవటం డిపార్ట్మెంట్ కి తీరని లోటుగా గుర్తు చేసుకున్నారు.. స్నేహితుడి తరపున గోవింద్ మాట్లాడాడు... మరో జన్మంటూ ఉంటే శ్రీనాథ్ కి మళ్ళీ స్నేహితుడుగా పుట్టాలని..స్నేహానికి ప్రాణం ఇచ్చే శ్రీనాథ్ తనకు తన కుటుంబం లో మనిషని చెప్పాడు.. అందరూ ఆనందించారు... ఆ రాత్రి దగ్గర్లో ఉన్న కామత్ హోటల్ లో భోజనం చేశారు శ్రీనాథ్, గోవింద్ కుటుంబాలు... చాలా రోజుల తరువాత సరళ బయట భోజనం చేసింది.. ఆమెకు నిజంగా అసూయగా ఉంది.. శ్రీనాథ్ ది మంచి ఉద్యోగం.. రిటైర్మెంట్ ఫంక్షన్ బాగా చేసారు..అందరూ పొగిడారు ఆయనను..వచ్చే నెల లో తన భర్త గోవింద్ రిటైర్మెంట్ వుంది.. మామూలు స్కూలు టీచర్ గా చేరి ఇప్పుడు ఒక స్కూల్ హెడ్మాస్టర్ గా రిటైర్ అవుతున్నాడు.. అప్పుడు ఫంక్షన్ యెలా జరుగుతుందో ఏమో ?? శ్రీనాథ్ రిటైర్మెంట్ ఫంక్షన్ లా ఆర్భాటంగా ఎలాగూ జరగదు...కనీసం లో కనీసం తల దించు కోకుండా జరిగితే చాలు...అలా చాలా మంది దేవుళ్ళకు మొక్కింది.. రిటైర్మెంట్ రోజు దగ్గర పడుతున్న కొద్దీ సరళ లో ఆందోళన పెరిగి పోతూ వచ్చింది... ఇద్దరూ వెళ్లి శ్రీనాథ్ ని, లక్ష్మి నీ పిలిచారు ఫంక్షన్ కి..మనసులో మాత్రం, న్యూనతా భావం నిండి ఉండటం వలన , సరళ వాళ్లు రాక పోతే బాగుండునని చాలా సార్లు అనుకుంది.. గోవింద్ మాత్రం మామూలుగానే ఉన్నాడు.. మామూలు రోజుల్లాగే రిటైర్మెంట్ రోజు వచ్చింది.. ఆ రోజు మామూలు గా స్కూల్ కి వెళ్లి కొన్ని క్లాసులు కూడా తీసుకున్నాడు పిల్లలకు.... అదే తన ఆఖరి క్లాసు కావటం తో రుద్ధమైంది ఆయన గొంతు.. కష్టం మీద క్లాసు కానిచ్చి స్టాఫ్ రూమ్ కి వచ్చాడు గోవింద్..

**సాయంత్రం నాలుగు గంటలయ్యింది.. ఆ పాటికే సరళను , పిల్లలను తీసుకుని శ్రీనాథ్ వాళ్లు కూడా స్కూల్ కి వచ్చారు.** శ్రీనాథ్ కి చాలా సంతోషంగా ఉంది..గోవింద్ రిటైర్ అవుతున్నాడు.. వాడూ ,తను కలిసి ఎన్నో కబుర్లు చెప్పుకుంటూ కాలం గడపాలి..ప్లాన్ వేసుకున్నాడు.

సరళ కు బెంగగా ఉంది..ముళ్ళ మీద కూర్చున్నట్లు ఉంది తనకు.. ఫంక్షన్ త్వరగా అయిపోతే బాగుండును..అనుకుంది. తలవొంపులుగా ఫంక్షన్ జరుగుతుంది ..తను తట్టుకోలేదు...మామూలు స్కూల్ టీచర్ రిటైర్ అయితే కొన్ని వేలమంది, లక్షల మంది టీచర్లు ఉన్నారు భర్తీ చేయటానికి... టీచర్ రిటైర్మెంట్ అంత గొప్ప విషయం కాదు.. తొందరగా ముగించి ఇంటికి చేరుకోవాలని ఆరాటం సరళకు.. పిల్లలు కూడా వచ్చారు..తండ్రి రిటైర్మెంట్ చూడడానికి...

**సరళ వాళ్ళను స్టాఫ్ రూం లో కూర్చో బెట్టారు.. మిగతా టీచర్లు..**

అప్పటి వరకూ పెద్దగా జనం లేరు . విద్యార్థులు , టీచర్లు అందరూ కలిసి ఒక వంద మంది ఉంటారు.. వాళ్ళు రోజూ స్కూల్లో ఉండే వాళ్లే కదా.. సరళ కు పెద్దగా సంతోషం కలగ లేదు ... ఇంకో పది నిముషాలకు ఫంక్షన్ మొదలవుతుందనగా ...ఎక్కడినుండి వచ్చారో..దాదాపు ఇంకో వంద మంది పైనే జనం వచ్చారు..వాళ్లు పిల్లల బంధువులని తెలిసింది... ఫంక్షన్ ఆరుబయట చెయ్యాలని నిర్ణయం చేశారు...అందరూ కూర్చోవడానికి కుర్చీలు కూడా లేవు..చాలా మంది నుంచునే ఉన్నారు...ఫంక్షన్ అయ్యేంత వరకూ.. ఎక్కడి నుండో పల్లకీ ని తీసుకు వచ్చారు... మాస్టారు గోవింద్ ను పిల్లలు పల్లకీ లో కూర్చుండ బెట్టారు.. కొంత మంది టీచర్లు, పిల్లల బంధువులు పల్లకీ మోయటానికి సిద్ధ పడ్డారు... సరళకు అంతా కలగా ఉంది... పల్లకీ లో గోవింద్ ని కూర్చో బెట్టి లేప బోతుండగా ఎవరో అరిచారు. మాస్టారి గారి ధర్మ పత్ని ని కూడా పల్లకీ లో కూర్చో బెట్టాలని.. అందరి బలవంతం మీద పల్లకీ లో కూర్చుంది సరళ.. గోవింద్ తో...పెళ్లి రోజు తరువాత మళ్లీ ఇన్నాళ్ళకు...పల్లకీలో ఎక్కడం.. సరళ కు సంతోషం తో కళ్ల వెంట నీళ్ళు వచ్చాయి పల్లకీ లేచింది..చిట్టి చేతులతో పిల్లలు కూడా పల్లకీ మోస్తున్న వాళ్ళకు సాయపడుతున్నారు.. ఆ దృశ్యం మనోహరం గా ఉంది.. కాలం కొన్ని క్షణాలు అలా ఆగిపోతే బాగుండునని అనిపించింది సరళకు.. గోవింద్ కి భాధ గానూ, సంతోషం గానూ ఉంది..పిల్లలూ జాగ్రత్త .. మీరు ఇబ్బంది పడకండి అంటూ వాళ్ళను వారిస్తున్నాడు..అయినా వాళ్లు వినటం లేదు ... ఇంతలో పల్లకీ ని దింపారు.. ఎందుకో అర్థం కాలేదు సరళకు, గోవిందు్కు. కారు దిగి నెమ్మదిగా వచ్చి నమస్కారం చేశాడు గోవింద్ కి ఆ వచ్చినాయన... గోవింద్ కాళ్ళకు దండం పెట్టాడు.. ఆ వచ్చినాయన జిల్లా ఎస్పీ గారు.. వెంట పది మంది పోలీసులు.. ఈ లోపల ఇంకో కారు వచ్చి ఆగింది.. వచ్చింది జిల్లా జడ్జ్ గారు..ఆయన కూడా తన వాళ్ళతో వచ్చారు.. జిల్లా ఎస్పీ, జడ్జ్ గారు, మిగతా వాళ్లు పల్లకీ మోస్తుండగా నిర్ణీత స్థలానికి చేరారు. నీళ్ళు, కాళ్ళు కడిగే ఇత్తడి పళ్ళెం వచ్చాయి...ఎక్కడి నుండో... ఎస్పీ, జడ్జ్ గార్లు గోవింద్ మాస్టారి కాళ్ళు కడిగి తల మీద చల్లుకున్నారు... కొంత మంది ఆడవాళ్ళు హారతి ఇచ్చారు గోవింద్ కి, సరళ కు.. ఆ రోజు పూల వాన కురిపించారు అందరూ వారిద్దరి మీద..పిల్లలు మాస్టారు గోవింద్ గారి గురించి మాట్లాడుతూ ఏడ్చేసారు.ఇంచుమించు టీచర్ల పరిస్థితి కూడా అంతే..అందరి కళ్ళు చెమ్మగిల్లాయి.. జిల్లా ఎస్పీ,జడ్జ్ కూడా మాట్లాడారు. తమ జీవితం లో తాము సాధించిన విజయాలు అన్నీ గోవింద్ మాస్టారి వలనే అని గర్వంగా చెప్పారు.. ఆయన పక్కన కూర్చోవటం కూడా వాళ్లకు మనస్కరించక నుంచునే ఉన్నారు..చాలా సేపు... అప్పటి వాతావరణం చెప్పటం కష్టం.. శ్రీనాథ్ సంతోషం చెప్పనలవి కాదు..తన స్నేహితుడికి జరుగుతున్న గొప్ప గౌరవం..అది.. వాడికి జరిగినా తనకూ జరిగినట్లే... శ్రీనాథ్ మాట్లాడుతూ చెప్పాడు..ఇక్కడున్న ఇన్ని వందల మంది లో తనొక్కడే గోవింద్ ని ఆప్యాయంగా ఒరేయ్ అని పిలువ గల అర్హత కలవాడవటం సంతోషంగా ఉందని అన్నాడు..చివరగా గోవింద్ మాట్లాడాడు..పిల్లలందరికీ నా ఆశీస్సులు... ఒకప్పటి నా విద్యార్థులు ఈ నాడు జిల్లాకు జడ్జ్ గానూ, ఎస్పీ గానూ ఉండటం తనకు ఎంతో సంతోషంగా ఉందని ..ఇలా పిల్లల్ని మంచి ఉన్నత స్థితి లో చూడటం తనకు గర్వ కారణం అనీ, ఈ పిల్లలే తన ఆస్తి ,ఐశ్వర్యం , వీళ్ళే నా సర్వస్వంఅంటూ ...మాట్లాడలేక పోయాడు.నాకు ఇంత గొప్ప వరం ఇచ్చిన భగవంతుడిని కోరేదొకటే అన్నాడు.. నా పిల్లలందరికీ మంచి భవిష్యత్తును, దీర్ఘాయువును ఇమ్మని కోరాడు. పిల్లలను పట్టుకోవడం ఎవరి తరం కాలేదు..అంతలా అభిమానించారు గోవింద్ మాస్టారును.. ఫంక్షన్ ముగిశాక అందరూ కలిసి వచ్చి గోవింద్ ని ఇంటి వరకూ దిగ బెట్టారు....వెళ్ళలేక వెళ్ళారు పిల్లలందరూ...

ఆ రోజు రాత్రి శ్రీనాథ్ , లక్ష్మి వారి పిల్లలూ గోవింద్ ఇంట్లోనే ఉండి పోయారు...

భోజనాలు అయిన తరువాత గోవింద్ పాతికేళ్ల కొడుకు సుబ్రహ్మణ్యం, తల్లితో అన్నాడు... నాన్న గారికి ఇంత ఆస్తి ఉందని నాకు ఇంత వరకూ తెలియదమ్మా నాకూ ఇంత వరకూ తెలియదురా అన్నది సరళ ఎంతో సంతోషంగా..శ్రీనాథ్ కల్పించుకుని అన్నాడు..వీడు కుబేరుడికి ఏం తీసిపోడు.. మనః స్ఫూర్తిగా చెపుతున్నాను. సరళ గోవింద్ వంక చూసింది.. గోవింద్ ...మనకు ఈ సంపద చాలు సరళా ఈ జన్మకు ... అన్నాడు.. ఆకాశం లో ఒక మెరుపు మెరిసింది.. గురువులు పూజ్య నీయులు .. వారు ప్రోగు చేసుకున్న అస్తి పిల్లల అభిమానమే... అన్నట్లుగా.

సేకరణ– పెరుమాళ్ళ వెంకట సురేంద్ర
(రుద్రవరం ప్రతినిధి)

## అదినేత పిలుపుతో కదిలిన అనుచరగణం

### లివర్ క్యాన్సర్ బాధితుడికి అండగా అభినవ్ రెడ్డి ఆర్మీ 26 వేలు ఆర్థికసాయం



**ఉదయగిరి ఆగస్టు 23నంది పత్రిక :** ఉదయగిరి నియోజకవర్గం కిష్టం పల్లె గ్రామానికి చెందిన తుపాకుల మహేష్, మంజుల కుమారుడు తుపాకుల. తన్విష్ లివర్ క్యాన్సర్ తో బాధపడుతున్న విషయమై యువనేత మేకపాటి అభినవ్ రెడ్డి పిలుపు మేరకు వైస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పల్లాల కొండారెడ్డి, వింజమూరు మండల కన్వీనర్ రేవునూరి. శ్రీనివాసుల రెడ్డి సహకారంతో అభినవ్ రెడ్డి ఆర్మీ సభ్యులు గంగిరెడ్డి,శివారెడ్డి,జిలానీ, మధు,వంశీ, పవన్, ఖాదర్ భాష , చైతన్య రెడ్డి, సుధాకర్ రెడ్డి,ఎమ్ . వేంకటేశ్వర రెడ్డి, కిషోర్, డాక్టర్ డాబా వెంకీ, బోగిరెడ్డి.చంద్ర ఆర్థిక సహకారంతో నేడు స్వయంగా టీం సభ్యులు ఇంటికి వెళ్లి నగదును బాలుడి తల్లి తండ్రులకు అందించారు . టీం సభ్యులు బాధితుడికి అండగా నిలవడం పట్ల గ్రామస్థులు సంతోషం వ్యక్తంచేశారు

## నూతన గృహ ప్రవేశ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి



**వెలుగోడు ఆగస్టు 23 (నంది పత్రిక):** వెలుగోడు పట్టణంలోని తెలుగుపేటకు చెందిన తెలుగు శ్రీనివాసులు నూతనంగా నిర్మించుకున్న గృహ ప్రవేశ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు శ్రీశైలం నియోజకవర్గ శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన గృహంలోకి ప్రవేశించిన శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. నూతన గృహం ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు మరియు సంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం గృహ యజమాని తెలుగు శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించి, పూలమాలలు వేసి జ్ఞాపికను అందజేసి తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నారపు శేషిరెడ్డి, కౌలాల రాముడు, తెలుగు బుడ్డన్న, తెలుగు రమణ, మధు, తెలుగు జంబులయ్య, క్లస్టర్ ఇంచార్జ్ ఖలీల్ ఖాన్, డాక్టర్ జాకీర్,స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, బంధుమిత్రులు మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## కురువుల ఆరాధ్య దైవం భక్త కనకదాసు నూతన విగ్రహావిష్కరణ





**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** ఆదోని మండలం జీ హోసల్లి గ్రామం నందు కురువ కులస్తుల ఆరాధ్య దైవం అయినటువంటి శ్రీ భక్త కనకదాస విగ్రహ స్థాపన,ఆవిష్కరణ కార్యక్రమమునందు రాష్ట్ర కురవ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప,ఆదోని కురువ సంఘం మండల అధ్యక్షుడుచాగి.మల్లికార్జున రెడ్డి ఆదోని పట్టణ కురువ సంఘం అధ్యక్షులు కురువ.రాఘవేంద్ర మరియు ఆదోని యువజన కురువసంఘం అధ్యక్షులు కురువ. మనోహర్,కురువసంఘం నాయకులు కొలిమి.వెంకటేష్ ఇతర కురవ సంఘం నాయకులు తోపాటుగా కలిసి కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి కనకదాసు యొక్క ఆశీర్వచనాలు తీసు కోవడంజరిగింది. గ్రామస్తులు ఘన స్వాగతం పలికి శాలువ పూలమాలలతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చాగి.మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఆదోని కురువ సంఘం ఆధ్వర్యంలో ఊరు ఊరా,వాడవాడనా భక్త కనకదాసు విగ్రహ ఏర్పాటుకు ఎల్లప్పుడు ఆదోని మండల కురవ సంఘం సహకారాలు ఉండదంటలు ఎప్పుడు ఉంటాయని తెలుపుతూ త్వరలో ఆదోని ఇరుగుప్ప సర్కిల్ నందు కాంశ్య భక్త కనకదాసు విగ్రహ ఏర్పాటు చేసి తీరుతామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలోని ఆదోని కురువ సంఘముక్యనాయకులు గ్రామ కురవ సంఘం నాయకులు పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఆపదలో ఉన్న పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక భరోసాగా నిలుస్తోందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. పంచలింగాల గ్రామంలోని తన నివాసంలో లబ్ధిదారులకు మంజూరైన రూ.10,99,948 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు...అర్హులైన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు...ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటరాముడు పాల్గొన్నారు.

### రాఖీ పండుగ రోజునే చంద్ర గ్రహణం.. భారత్‌లో కనిపిస్తుందా..?

ఈ ఆగస్టు 28న, రాఖీ పౌర్ణమి పండుగ రోజున అరుదైన పాక్షిక చంద్రగ్రహణం ఏర్పడనుంది. ఇది దాదాపు సంపూర్ణ గ్రహణంలా కనిపించనుండటం దీని ప్రత్యేకత. అయితే, ఈ అద్భుతమైన ఖగోళ ఘటన భారత్‌లో కనిపించదు. దేశంలో ఆ సమయంలో పగటిపూట ఉండటమే దీనికి కారణం.

ఈ గ్రహణం ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాల్లో అత్యంత స్పష్టంగా కనిపిస్తుంది. దాదాపు 100 కోట్ల మంది దీనిని పూర్తిస్థాయిలో వీక్షించే అవకాశం ఉందని ఖగోళ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఐరోపా, ఆఫ్రికా, పశ్చిమాసియాలోని కొన్ని ప్రాంతాల్లో కూడా పాక్షికంగా కనిపిస్తుంది. అయితే ఆస్ట్రేలియా, అంటార్కిటికా, భారత్ సహా పసిఫిక్ తీరంలోని చాలా దేశాల్లో ఇది కనిపించదు.

## ప్రజలందరి సహకారంతోనే నగరాన్ని పరిశుభ్రంగా ఉంచగలం.





### కమిషనర్ ఎం. జయకృష్ణ.

**తిరుపతి బ్యూరో చీఫ్ ఆగస్టు 23 నంది పత్రిక** ప్రజలందరి సహకారంతోనే పుణ్యక్షేత్రమైన తిరుపతి నగరాన్ని పరిశుభ్ర, స్వచ్ఛమైన నగరంగా తీర్చిదిద్దగలమని, ఇందుకోసం అందరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన వినతులను, నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి ప్రజలను కలిసి పారిశుధ్యం పై అవగాహన కల్పించారు. తారక రామ స్టేడియం లో, వెటర్నరీ యూనివర్సిటీ లో వాకర్స్ ను కలిసి నగరంలోని సమస్యలు, పరిష్కార మార్గాలపై మాట్లాడారు. రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ లను పరిశీలించి మరింత మెరుగ్గా పారిశుధ్య పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పి.పి. చావడి, చెన్నారెడ్డి కాలనీలో నుండి వచ్చిన పిర్యాదులను పరిశీలించి పిర్యాదుదారులతో మాట్లాడారు. మీ అందరూ సహకరిస్తేనే నగరం శుభ్రంగా ఉంటుందని తెలిపారు. కాలువల్లో చెత్త వేయడం, రోడ్ల పైన ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం మానుకోవాలని తెలిపారు. మీ ఇంటి వద్దకు వచ్చే మాకు సిబ్బందికి వేరు చేసిన చెత్త ఇవ్వాలని తెలిపారు. మన ఇంటితో పాటు నగరాన్ని శుభ్రంగా ఉంచుకునేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, తదితరులు ఉన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ను సద్వినియోగం చేసుకోండి



**తిరుపతి బ్యూరో చీఫ్ ఆగస్టు 23 నంది పత్రిక** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ, ఐఏఎస్ గారు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆగస్ట్ 24వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ ఎం.జయకృష్ణ, తెలియజేశారు.

# జనసేన పార్టీ ఆత్మీయ సమ్మేళన సమావేశ కార్యక్రమంలో పాల్గొన్న
# జనసేన పార్టీ నాయకులు సంధ్య విక్రమ్ కుమార్

**కర్నూల్ సిటీ నంది పత్రిక** జనసేన పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆశయ సాధనలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు చింతా అన్న నేతృత్వంలో కోడుమూరు నియోజకవర్గం కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామం లో జనసేన పార్టీ ముఖ్య నాయకుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎక్కువ సమయం లేదు కాబట్టి అందరం కలిసిమెలిసి ఏకధాటిగా ఐక్యమత్యంతో ముందుకు సాగే విధంగా ప్రణాళికను సిద్ధం చేసుకోవడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మన కోడుమూరు నియోజకవర్గం నాయకులు అనునిత్యం పార్టీ కోసం కృషి చేస్తున్నటువంటి యంగ్ అండ్ డైనమిక్ లీడర్ సంధ్య విక్రమ్ కుమార్ పాల్గొనడం జరిగింది. సంధ్య విక్రమ్ కుమార్ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మనమంతా ఏకతాటిపై ఎక్కడా కూడా తారతమ్యాలు లేకుండా ముందుకు సాగుదాం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో మన శంఖారావాన్ని పూరిద్దాం మనకు వచ్చినటువంటి సీట్లలో కచ్చితంగా మనం గెలిచి మన సత్తా నిరూపించుకుందామని తెలియజేశారు. మిగతా నాయకులు కూడా వారి వారి ఆలోచన విధానాలను తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాయలసీమ జోన్ 2 కార్యక్రమాల కార్యనిర్వహణ కమిటీ సభ్యులు సి లక్ష్మన్న ( లక్ష్మణ్ జనసేన రజక ), కృష్ణబాబు కాశపోగు , ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యక్రమాల కార్యనిర్వహణ కమిటీ సభ్యులు ఎం శాలు బాషా , ఎం తిమ్మప్ప , కె మధుసూదన్ , ఎం శ్రీను , ఎం ప్రకాశం , బి చిత్రసేనుడు , బి శేష్ కుమార్ , బి శ్రీనివాస్ , ఎం స్వాములు , ఎం రంగస్వామి , ఎం వెంకటేష్ , మరియు జనసేన నాయకులు జనసైనికులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.



ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుండి 44 వేల క్యూసెక్ ల నీటిని వాడుకోవాలి..



**మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి.**
**అబ్దుల్లాపురం లేదా మాధవరం గ్రామాల వద్ద నూతన రిజర్వాయర్ నిర్మించాలి.**
**కె సి కెనాల్ రైతులకు ప్రాణవాయువు.**
**జీవో 98 నిరుద్యోగులకు 674 మందికి ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలి.**
**వైఎస్ఆర్సిపి టాస్క్ ఫోర్స్ కమిటీ24 రాక!**

**జూపాడుబంగ్లా, ఆగస్టు: 23 (నంది పత్రిక ):** రాయలసీమ పరివాహక ప్రాంతానికి వరప్రసాయాన్నిధిగా నిలిచిన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 44 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసుకొని నందికొట్కూరు ఆత్మకూరు ప్రాంత రైతుల కష్టాలు తీర్చాలని నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి డిమాండ్ చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ను పరిశీలించేందుకు వైఎస్ఆర్సిపి టాస్క్ ఫోర్స్ కమిటీ త్వరలో రాబోతుందని ఆ కమిటీకి స్వాగతం పలుకుతూ నందికొట్కూరు ప్రాంత రైతుల కష్టాలను వారి దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని జూపాడుబంగ్లా ఎంపీడీవో కార్యాలయం ఆవరణం లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంత రైతులకు సాగునీరు తాగునీరు మద్రాస్ కు తాగునీటీ అందించే లక్ష్యంతో శ్రీశైలం మిగులు జలాలను అందించేందుకు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ను నిర్మించడం జరిగిందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో 841 అడుగుల నీరు ఉన్నప్పుడే పోతిరెడ్డిపాడు ద్వారా 44 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసేందుకు అవకాశం ఉందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 44 వేల క్యూసెక్కుల నీటిని వాడుకునేందుకు రాయలసీమ ఎత్తిపోతల పథకం చేపట్టడం జరిగిందన్నారు. అయితే రాయలసీమ ఎత్తిపోతల పథకానికి అంతర్ రాష్ట్ర జలవివాదాలు అనుమతి, ఎన్జిటి అనుమతి ఇప్పటివరకు మంజూరు కాకపోవడంతో రాయలసీమ ప్రాంత వాసులు శ్రీశైలం మిగులు జలాలను సద్వినియోగం చేసుకోవడంలో వెనుక పడ్డారన్నారు. అలాగే ఈ ప్రాజెక్టు ద్వారా నందికొట్కూరు,ఆత్మకూరు నియోజకవర్గం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అయితే వెలుగోడు మండలంలోని అబ్దుల్లాపురం లేదా మాధవరం గ్రామాలలో నూతన రిజర్వాయర్ నిర్మించినట్లయితే 44 వేల క్యూసెక్కుల నీటితో ఈ ప్రాంత రైతాంగం సాగు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. కేసీ కెనాల్ కు మల్యాల రెండు పంపుల ద్వారా, ముచ్చుమర్రి నాలుగు పంపుల ద్వారా సాగు,తాగు నీరు ఉపయోగించుకునే వేసల భాటు ఉందన్నారు. కేసీ కెనాల్ నందికొట్కూరు ప్రాంతం ఆత్మ కూరు నియోజకవర్గం లోని రైతులకు ప్రాణవాయువు అన్నారు.శ్రీశైలం జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం కోసం నందికొట్కూరు నియోజకవర్గం లో వేలాది ఎకరాల సారవంతమైన భూములు ఇల్లు సర్వస్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జీవో 98 క్రింద దాదాపు 1682 ఉద్యోగాలకు అప్పటి ముఖ్యమంత్రి ఎన్ కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం అన్ని అనుమతులు మంజూరు చేసిందన్నారు. అప్పట్లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా నందికొట్కూరు మార్కెట్ యార్డ్ నందు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమం లో 992 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. ప్రస్తుతం జీవో 98 కింద రెండవ జాబితాలోని 674 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని 151 రోజులుగా ముంపు నిరుద్యోగులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఉద్యోగ అవకాశాలు కల్పించి చావుకు దగ్గరగా ఉన్న నిరుద్యోగుల కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు నక్క చిన్న మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# హంద్రీనీవా కాలువ నీటిని వాడుకుంటున్న రైతులకు భరోసా ఇచ్చి ఆదుకోవాలి

## ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు జగన్నాథం

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లాలో హంద్రీ నీవా సుజల స్రవంతి ప్రధాన కాలువ వెంట ఏడు మండలాల్లో రైతులు తమ పంట పొలాలు ఎండిపోకుండా ఆరుతడి పంటలకు నీళ్లు కట్టుకుంటూ ఉంటే స్థానిక రెవెన్యూ అధికారులు పోలీసులు వారు బెదిరించి మోటార్ల కనెక్షన్ తీసివేయాలని అంటున్నారు ఈ చర్యను ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో తీవ్రంగా ఖండిస్తున్నాము అని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాథం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం కర్నూలు జిల్లాలో తీవ్రమైన కరువు పరిస్థితి ఏర్పడ్డాయి ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు అయింది పెద్ద వర్షాలు జిల్లాలో ఎక్కడా లేవు అన్ని మండలాల్లో తీవ్రమైన కరువు పరిస్థితులు ఉన్నాయి వేసిన పంటలు ఎండిపోయాయి ఇంకా చాలామంది రైతులు పంటలు సక్రమంగా వేసుకోలేదు వర్షాలు లేవు వేలకు వేలు పెట్టుబడి పెట్టి రైతులు దిగులు చేస్తున్నారు ఇంత తీవ్రమైన కరువు పరిస్థితుల్లో పక్కన ఉన్నటువంటి బోర్ల ద్వారా తమ బోర్ల నుండి నీళ్లు పెట్టి పంటలుపండించుకుందామంటే బోర్లలో కూడా నీళ్లు లేవు ఇలాంటి పరిస్థితులలో హంద్రీనీవాలు పుష్కలంగా నీళ్లు పోతూ ఉంటే ఆ నీళ్ళని ఆయిల్ మోటర్ ద్వారా కరెంటు మోటార్ల ద్వారా గాలి పైపుల ద్వారా తమ పొలాలకు తడుపుకుంటున్నారు కొంతమంది బకెట్ల ద్వారా బిందెల ద్వారా తోడుకొని పంట పొలాలు తడుపుతున్నారు కానీ ఏమాత్రం గమనించకుండా రైతుల వేసిన కరెంట్ కనెక్షన్ తీసివేయాలి లేకపోతే కేసులు నమోదు చేస్తామని అధికారులు బెదిరించటం చాలా నీచమైన పని కష్టకాలంలో ఉన్న అన్నదాతను ఆదుకోవాలి దేశానికి ఆహార ధాన్యల పండించే రైతు కరువు వల్ల బక్క చెక్కి అప్పుల పాలై తమ పంటలు ఎండిపోతుంటే మానవతా దృక్పథంతో నీళ్లు వాడుకోమని చెప్పాలి కానీ ఉన్న మోటార్లను తొలగించడం దుర్మార్గమైన చర్య మీ చర్య సహించరానిది తమ కళ్ళు ఎదుట మా పంట పొలాలు ఎండుతున్నాయి పక్కనే హంద్రీ నదిలో పుష్కలంగా నీళ్లు పోతున్నాయి వృధాగా పోతున్నటువంటి ఈ నీళ్లను వాడుకుంటే వారి సొమ్ము ఏమి పోతుంది వారికి ఏమైనా నష్టమా దేవుడు ఇచ్చిన నీళ్లను కూడా వాడుకోవడం తప్పు కావున ప్రభుత్వ అధికారులు ఈ విషయాన్ని వెంటనే గమనించాలి 3, క్యూసెక్కుల కెపాసిటీతో నీళ్లు ప్రవహిస్తున్నాయి శ్రీశైలం ప్రాజెక్టులో కూడా 875 అడుగులకు నీరు చేరింది అంటే మరొక పది అడుగుల నీరు వస్తే శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిగా నిండుకుండ లాగా ఉంటుంది ఇలాంటి పరిస్థితుల్లో హంద్రీనీవాడీళ్లు వాడుకోవడం చాలా సమంజసమైన పని కావున అధికారులు ఇప్పటికైనా తమ




పొరపాటున గమనించాలి జిల్లా కలెక్టర్ వెంటనే ఆదేశాలు జారీచేసి రైతుల మోటర్లు తొలగించకూడదు రైతులను నష్టం జరగకుండా చూడాలని భరోసా ఇవ్వాలి అధికారులను అధికారులకు చెప్పి రైతులపై దౌర్జన్యం చేయకుండా మూటలు తొలగించకుండా చూడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము .

## సత్తెనపల్లిలో విషాదం.. లిఫ్ట్‌లో ఇరుక్కుని బాలిక మృతి

పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో విషాదం చోటుచేసుకుంది. ఆడుకోవడానికి పక్కింటికి వెళ్లిన ఓ బాలిక లిఫ్ట్‌లో ఇరుక్కుని ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన కొత్తపేట కాలనీలో జరిగింది. అయితే, ఇది కేవలం ప్రమాదం కాదని, తమ కుమార్తె మృతిపై అనుమానాలున్నాయని తల్లిదండ్రులు ఆరోపించడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. కొత్తపేటకు చెందిన రేవతి (12) ఆదివారం సాయంత్రం పక్కింట్లో తన స్నేహితులతో ఆడుకోవడానికి వెళ్లింది. అపార్ట్‌మెంట్‌లోని లిఫ్ట్ వద్ద ఆడుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు అందులో ఇరుక్కుపోయింది. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడి ఉన్న రేవతిని చూసిన స్థానికులు వెంటనే స్పందించినా, అప్పటికే బాలిక మృతి చెందింది. ఆడుకోవడానికి వెళ్లిన తమ కుమార్తె నిమిషాల వ్యవధిలోనే విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేస్తూ, తమ కుమార్తె మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. కేవలం ప్రమాదవశాత్తు ఇలా జరగలేదని, దీని వెనుక వేరే కారణాలు ఉండవచ్చని ఆమె ఆరోపించారు. దీంతో ఈ ఘటనకు కొత్త కోణం తోడైంది. ఆ ఇంట్లో లిఫ్ట్ ను కొన్నిరోజుల కిందటే ఏర్పాటు చేశారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు రంగప్రవేశం చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, అనుమానాస్పద మృతి (సెక్షన్ 174 సీఆర్పీసీ) కింద కేసు నమోదు చేశారు. అపార్ట్‌మెంట్‌లోని సీసీటీవీ ఫుటేజీని స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు.

## రేపు నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరపాలక సంస్థలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చల్లా ఓబులేసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:00 గంటలకు స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నగరపాలకకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరు అవుతారని, కాలనీల్లోని మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి వెలుగులు, పరిశుభ్రత వంటి సమస్యలను ప్రజలు లిఖిత పూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు.ప్రతి ఫిర్యాదు స్వీకరించబడిన వెంటనే సంబంధిత అధికారులకు పంపి, పరిష్కారం కోసం నిర్దిష్ట గడువులు నిర్ణయించబడతాయని ఆయన వెల్లడించారు. అదేవిధంగా, ప్రతి ఫిర్యాదు పురోగతిని పౌరులు స్వయంగా హెచ్ టీ టీ పి యస్ :మీకోసం .ఏపీ .గవర్నమెంట్ .ఇన్ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని కమిషనర్ వివరించారు.

## శ్రీ చింతల మునిస్వామి ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ



**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఆదోని మండలం పెసలబండ గ్రామంలో శ్రీ శ్రీ చింతల మునిస్వామి ఆరాధనోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ ఆరాధనోత్సవాల్లో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండా లని, గ్రామంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని స్వామివారిని ప్రార్థించారు. ఆరాధ నోత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులను ఆమె పలకరించి, గ్రామస్థులతో ఆత్మీ యంగా మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, ఆలయ నిర్వాహకులు గుడిసె ఆది కృష్ణమ్మ కి ఘనస్వాగతంపలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగరాజు, రామకృష్ణ, రామకృష్ణరెడ్డి,పురుషోత్తం,శంకరప్ప యాదవ్, బెస్త ఓంకార్,మహాదేవ, దేవేంద్ర, మునిస్వామి, వెంకటేష్, రాఘవ రెడ్డి,ఉపేంద్ర, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మద్దిలేటి స్వామి దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా మలసాని శేషఫణికి ఘన సన్మానం



**నందిపత్రిక -ప్యాపిలి** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహ స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా నియమితులైన మలసాని శేషఫణిని ప్యాపిలి మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. ప్యాపిలి పట్టణంలోని తన ఇంట్లో ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ రాజా మురళి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మలసాని శేషఫణిని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు శాలువా, పూలమాలలతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ప్యాపిలి ప్రాంతానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖుడికి స్వామివారి ఆలయ ట్రస్ట్ బోర్డులో స్థానం దక్కడం పట్ల రాజా మురళి హర్షం వ్యక్తం చేశారు.

**దేవస్థాన అభివృద్ధికి శ్రమిస్తా:** సన్మాన గ్రహీత మలసాని శేషఫణి మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ప్రజాప్రతినిధులకు, ఆలయ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. మద్దిలేటి స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు, ముఖ్యంగా ప్యాపిలి పరిసర ప్రాంత ప్రజలకు ఆలయంలో మెరుగైన వసతులు అందేలా నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ హరి, జక్కా శేషఫణి, గురు, రమేష్,కుప్పా నాగేంద్ర,శ్రీకాంత్, నాగరాజు, దత్తు, శంకర్బాబు, కిరణ్ పాల్గొన్నారు.

## పార్నపల్లెలో నూతన చర్చికి ఏర్పాట్లు

### పునాదిరాయివేనున్న నంద్యాల బిషప్

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 23:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న పార్నపల్లె గ్రామంలో సోమవారం నూతన చర్చి ఏర్పాటుకు గాను సన్నాహాలు చేస్తున్నారు. నంద్యాల సిఎస్ఐ డయాసిస్ బిషప్ ది. రెవ. కామునురి సంతోష్ ప్రసన్న రావు ముఖ్యఅతిథిగా పాల్గొని చర్చి నిర్మాణానికి గాను పునాదిరాయి వేయ నున్నారు. 167 కే హైవే రోడ్డు విస్తరణలో భాగంగా పార్నపల్లెలో ఉన్న చర్చి స్థలం రహదారి పరిధిలోకి రావడంతో పాత చర్చిని తొలగించాల్సి వచ్చింది. క్రైస్తవ సోదరులకు ప్రార్థనలు ఆరాధనలకు అసౌకర్యం కలగకుండా నూతన చర్చి నిర్మాణానికి పూనుకున్నామని చర్చి కమిటీ సభ్యులు సన్మాన రాజు, సన్మాల సుధాకర్, గడ్డం ఓబులేసు,సునీల్, లింగన్న, ఏసేపు, రిటైర్డ్ ఉపాధ్యాయులు సామ్యూల్,నరసింహులు తెలిపారు. సి ఎస్ ఐ డయాసిస్ ఉమెన్స్ ఫెలోషిప్ అధ్యక్షురాలు దాసరి బ్యూలా సంతోష్, వైస్ ప్రెసిడెంట్ రాజేంద్ర బాబు, కార్యదర్శి బిల్లా ప్రభుదాస్, ట్రెజరర్ నందం ఐజాక్,అసిస్టెంట్ సెక్రటరీ ఎమ్మెస్ స్టీఫెన్, అసోసియేట్ ట్రెజరర్ రెవ. బండి శామ్యూల్, పాస్టరేట్ చైర్మన్ రెవ. కరుణాకర్,కాకనూరు ఫాస్ట్ రేట్ ఉమెన్స్ ఫెలోషిప్ అధ్యక్షురాలు మేరీ హెప్సిబా తదితరులు చర్చి పునాది కార్యక్రమంలో పాల్గొంటారని చర్చి కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



# జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు గారి జయంతి

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి కార్యక్రమం జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ అధ్యక్షతన జరిగింది. ముందుగా టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటమునకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ మహనీయుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు పేరు వినగానే ధైర్యం, దేశభక్తి, నిస్వార్థ ప్రజాసేవ మనకు గుర్తుకొస్తాయి. టంగుటూరి ప్రకాశం పంతులు స్వాతంత్ర్య సమరయోధులు, న్యాయవాది, ప్రజానాయకులు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా సేవలందించిన గొప్ప వ్యక్తి. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడారు. ప్రజల హక్కుల కోసం ఎలాంటి ఒత్తిడికీ లొంగకుండా ముందుకు సాగారు. ఆయనకు "ఆంధ్రకేసరి" అనే బిరుదు రావడానికి కారణం ఆయన అపారమైన ధైర్యం. బ్రిటిష్ సైనికులు తుపాకులు గురిపెట్టిన సమయంలో కూడా భయపడకుండా తన ఛాతీ చూపిస్తూ నిలబడిన సంఘటన ఆయన ధైర్యానికి చారిత్రక ఉదాహరణగా నిలిచిందని ఖాజా హుస్సేన్ తెలియజేశారు. అనంతరం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీసాల సుమలత మాట్లాడుతూ ప్రకాశం పంతులు జీవితంలో మనం నేర్చుకోవాల్సిన ముఖ్యమైన విషయం పదవి కోసం కాదు, ప్రజల కోసం పనిచేయడం. అధికారం ఉన్నా లేకపోయినా ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన కట్టుబడి ఉండేవారనీ నిజాయితీ, ధైర్యం, త్యాగం, ప్రజాసేవ వంటి విలువలను ఆయన తన జీవితంతోనే చూపించారు. ఈ రోజుల్లో రాజకీయాల్లో ఉన్న మనమంతా ప్రకాశం పంతులు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. ప్రజలకు అండగా ఉండాలి, బలహీన వర్గాల గొంతుకగా నిలవాలి, కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేయాలి. సమాజంలో ఐక్యతను పెంచుతూ, అభివృద్ధి కోసం పనిచేయాలి. టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం మనకు ఒక గొప్ప సందేశం ఇస్తుంది భయపడకుండా నిజం కోసం నిలబడాలి, ప్రజల కోసం పనిచేయాలి, దేశం కోసం త్యాగం చేయాలి. ఆ మహనీయుడి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని సుమలత గారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి బి సుబ్రహ్మణ్యం, ఐ ఎన్ టి యు సి సిటి అధ్యక్షులు రేపల్లె ప్రతాప్, ఎస్సీ సెల్ డబ్ల్యూ సత్యరాజు, వార్డు ఇన్చార్జిలు షేక్ షబ్బీర్, జావీద్ ఐఎన్టియుసి నాయకులు రామకృష్ణారెడ్డి, ఆనందరావు, నాగన్న మొదలగువారు పాల్గొన్నారు.



# తెలుగు వారి భగీరథుడు "ఆంధ్ర కేసరి"



## 'టంగుటూరి' 155వ జయంతి వేడుకలో డిఆర్వో మల్లికార్జునుడు

**కడప, బ్యూరో చీఫ్ ఆగస్టు 23 నంది పత్రిక** : ఆంధ్రుల ఆవేశానికి, ఆత్మవిశ్వాసానికి ప్రతీక అయిన టంగుటూరి ప్రకాశం పంతులు.. తెలుగు వారి పాలిట అపర భగీరథుడు అని జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు అభివర్ణించారు. ఆదివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ పిజిఆర్ఎస్ హాలులో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుక జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన, జిల్లా పరిపాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా డిఆర్వో మల్లికార్జునుడు మాట్లాడుతూ... టంగుటూరి ప్రకాశం పంతులు పేరు వినగానే తెలుగు వారికి ప్రకాశం జిల్లా, బెజవాడ ప్రకాశం బ్యారేజీ గుర్తుకు వస్తాయని తెలిపారు. ఆయన జన్మించిన వినోదరాయునిపాలెం ప్రాంతం పేరుతో ప్రకాశం జిల్లాకు నామకరణం జరిగిందని, కృష్ణా నది జలాలను సద్వినియోగం చేసి ఆయకట్టు భూములను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో బ్యారేజీ నిర్మాణానికి ఆయన కృషి చేశారని వివరించారు. సాధారణ కుటుంబంలో జన్మించిన ప్రకాశం పంతులు విద్యాభ్యాసం పూర్తి చేసి న్యాయవాద వృత్తిలో స్థిరపడాలని భావించినప్పటికీ, అనంతరం స్వాతంత్ర్యోద్యమం వైపు అడుగులు వేశారని చెప్పారు. 1928లో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో బ్రిటిష్ పోలీసుల ఎదుట గుండె చూపి నిలబడిన ధైర్యసాహసాల కారణంగా 'ఆంధ్ర కేసరి'గా గుర్తింపు పొందారని తెలిపారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన అనంతరం తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి ప్రజలకు సేవలందించారని పేర్కొన్నారు. కృష్ణా నదిపై బ్యారేజీ నిర్మాణం విషయంలో ప్రకాశం పంతులు చూపిన ప్రత్యేక శ్రద్ధను డిఆర్వో వివరించారు. నదీ ప్రవాహంలో గండిని పూడ్చే ప్రయత్నంలో ఇంజినీర్ వేపా కృష్ణమూర్తి మృతి చెందిన ఘటన ఆయనను తీవ్రంగా కలచివేసిందని, దీంతో బ్యారేజీ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. 1954 ఫిబ్రవరి 13న బ్యారేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, అనంతరం నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 1957 డిసెంబరు 24న బ్యారేజీని ప్రజలకు అంకితం చేశారని చెప్పారు. ఈ కృషి కారణంగానే ప్రకాశం పంతులు అపర భగీరథుడిగా పేరు పొందారని అన్నారు. పేదరికాన్ని అధిగమించి విద్యను అభ్యసించిన ప్రకాశం పంతులు జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మల్లికార్జునుడు తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లించేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడిన సమయంలో ఆయన తల్లి తన పట్టువస్త్రాన్ని తాకట్టు పెట్టి ఫీజు చెల్లించిన ఘటనను గుర్తుచేశారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేద విద్యార్థుల కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయడం ద్వారా తన గతాన్ని ఆయన గుర్తు చేసుకున్నారని తెలిపారు.ప్రకాశం పంతులు ధైర్యసాహసాలు, ప్రజాసేవా తత్వం, ఆత్మవిశ్వాసం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని డిఆర్వో పేర్కొన్నారు. ఆయన జీవిత చరిత్రను యువత తెలుసుకుని దేశం, సమాజం కోసం సేవ చేయాలనే స్ఫూర్తిని పొందాలని సూచించారు.కార్యక్రమంలో ముందుగా డిఆర్వో జ్యోతి ప్రజ్వలన చేసి.. అనంతరం, టంగుటూరి ప్రకాశం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన విభాగం సెక్షన్ల అధికారులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.



# పిజిఆర్ఎస్ సేవలపై పై క్యూ.ఆర్‌కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**కడప, బ్యూరో చీఫ్ ఆగస్టు 23 నంది పత్రిక:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ద్వారా అందుతున్న సేవలపై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మరింత పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతర అభిప్రాయ సేకరణ చేసి ప్రజల సంతృప్తి స్థాయిని మెరుగుపరచడం, వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను కోరుతుందన్నారు. పిజిఆర్ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్ని సేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాలలో, వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. క్యూ. ఆర్ కోడ్‌ను స్పష్టంగా, కంటికి కనిపించే పరిమాణంలో ముద్రించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పౌరులు పిజిఆర్ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చున్నారు. . ఎక్కువ సంఖ్యలో పౌరులు భాగస్వామ్యం అయ్యే విధంగా నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్లు, తదితర ప్రదేశాల్లో పెట్టాలని కలెక్టర్ సూచించారు.క్యూ.ఆర్ కోడ్ ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ కు చేరుతుందని అన్నారు. ఆర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు అందించండి, వాటిపై మీ స్పందన క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ప్రిస్క్రిప్షన్ లేకుండా హెచ్ వన్, ఎన్ ఆర్ ఎక్స్ విక్రయాలు చేయరాదు




## డ్రగ్ ఇన్స్పెక్టర్ హనుమన్న

**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్ట్ 23, నంది పత్రిక** ప్రభుత్వ గుర్తింపు పొందిన డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే హెచ్ వన్, ఎన్ ఆర్ ఎక్స్ డ్రగ్స్ ను మెడికల్ స్టోర్ లలో విక్రయించాలని, ప్రిస్క్రిప్షన్ లేనిది విక్రయాలు చేయరాదనీ నంద్యాల డ్రగ్ ఇన్స్పెక్టర్ హనుమన్న తెలిపారు. ఆదివారం ఆళ్లగడ్డ, చాగలమర్రి మెడికల్ స్టోర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మెడికల్ స్టోర్స్ లలో ప్రతి బిల్లును, స్టాక్ రిజిస్టర్ ను సరిగా చూసుకోవా లన్నారు. గడువు ముగిసిన మందులను విక్రయించరాదని, షాపులో లైసెన్స్ బోర్డు కనిపించేలా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఏపీ ఫార్మసీ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ విజయభాస్కర్ మాట్లాడుతూ రిజిస్టర్డ్ ఫార్మాసిస్టులకు ఎటువంటి రెన్యూవల్స్, రిజిస్ట్రేషన్ ఇబ్బందులను, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్ర ,నాగేంద్ర, ఆళ్లగడ్డ, చాగలమర్రి మెడికల్ స్టోర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# సత్ప్రవర్తనతో జీవించాలి: రౌడీషీటర్లకు ఎస్సై నాగార్జున కౌన్సిలింగ్



**నందిపత్రిక -ప్యాపిలి** నేర ప్రవృత్తిని వీడి సమాజంలో గౌరవ ప్రదమైన జీవితం గడపాలని ప్యాపిలి ఎస్సై నాగార్జున సూచించారు. నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాణ్ ఆదేశాల మేరకు, డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి పోలీసు స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లు, నేరచరిత్ర ఉన్నవారు, చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే ధ్యేయంగా పోలీసు శాఖ పనిచేస్తోందన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నేరాల జోలికి వెళ్లకుండా, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో జీవించాలని హెచ్చరించారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు.

# కళాకారుల సమస్యలు పరిష్కరించండి.

## ఆగస్టు 25న జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

## ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి వి నాగరాజు

**కర్నూల్ సిటీ నంది పత్రిక** రాష్ట్ర వ్యాప్తంగా కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ న రాష్ట్ర సమితి పిలుపు మేరకు కర్నూల్ కలెక్టర్ కార్యాలయం దగ్గర జరుగు ధర్నా లో అధిక సంఖ్యలో కళాకారులు పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ ప్రజానాట్య మండల జిల్లా కార్యదర్శి బి నాగరాజు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు ఆదివారం నాడు పత్రికా ప్రకటన లో నాగరాజు మాట్లాడుతూ జానపద కళాకారులు, పౌరాణిక కళాకారులు, సాంఘిక నాటక, కళాకారులు రంగస్థలం, కళాకారులు డప్పు, నృత్యాలు, కోలాటం, చెక్కభజన, బుర్రకథ, హరికథ, గురువయ్యలు తోలుబొప్పలాట వివిధ కళారూపాల ప్రదర్శనలు ఆట పాట మాట కార్యక్రమాలు ధర్నాలు ఏర్పాటు చేయడం జరిగింది కావున వివిధ కళా రూపాయల కళాకారులతో అధిక సంఖ్యలో కర్నూలు జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి రావాలని కోరుతూ రండి కదలిరండి మన సమస్యలు మనమే పరిష్కారానికి పెద్ద సంఖ్యలో కదలాలని కళాకారులందరికీ ఆయన పిలుపునిచ్చారు, గతంలో కళాకారులు కళల నమ్ముకుని జీవనం సాగించేవారని అయితే మారిన పరిస్థితుల రీత్యా కళాకారులకు జీవన భృతి లేకుండా పోయిందని కావున రాష్ట్ర ప్రభుత్వమే కళాకారులను అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ కళాకారుల కోసం జరిగే ఆందోళనలో కళాకారులందరూ స్వచ్ఛందంగా పాల్గొని మన డిమాండ్ల సాధన కోసం పోరాడుదాం అని ఆయన పిలుపునిచ్చారు .

# పోలింగ్ కేంద్రాల జాబితా ప్రచురణ




**రుద్రవరం ప్రతినిధి ఆగస్టు 23 (నంది పత్రిక):** మండలంలో త్వరలో జరగబోయే గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల లిస్టును నోటీసు బోర్డులపై ప్రచురించినట్లు డిప్యూటీ ఎంపీడీవో బాలాంజనేయులు తెలిపారు. ఆదివారం ఆయన పోలింగ్ కేంద్రాల జాబితాను స్థానిక మండల పరిషత్ కార్యాలయం నోటీసు బోర్డు దగ్గర ప్రచురించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుద్రవరం మండలంలో 21 గ్రామపంచాయతీలు ఉన్నాయన్నారు. ఇందుకు సంబంధించి 204 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. వీటికి సంబంధించిన జాబితాను ఆయా గ్రామపంచాయతీలలోని ముఖ్యమైన మూడు ప్రధానకూడలిలో సంబంధిత అధికారులు ప్రసరించడం జరిగిందన్నారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ హరికిషన్ ఉన్నారు

# స్పెషల్ క్యాంపెయిన్ డే పరిశీలించిన నగరపాలక సంస్థ కమిషనర్ చర్ల ఓబులేష్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఎస్ఐఆర్2026 ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రెండో రోజు స్పెషల్ క్యాంపెయిన్ డేను కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పరిశీలించారు. ఆదివారం 3, 4, 5, 6, 7, 183, 184, 188, 189, 190, 191, 192, 193, 194, 195, 196 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో పరిశీలించుకోవడంతో పాటు, కుటుంబ సభ్యుల పేర్లను కూడా తనిఖీ చేసుకునేలా ఓటర్లకు అవగాహన కల్పించారు. పేర్లు లేని వారు ఫారం6 ద్వారా, పేర్లలో మార్పులు లేదా సవరణల కోసం ఫారం8 ద్వారా, అనర్హులు, మరణించిన లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన ఓటర్లపై ఫారం7 ద్వారా అభ్యంతరాలు, దరఖాస్తులు సమర్పించినట్లు పేర్కొన్నారు.స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియ సజావుగా నిర్వహించాలని బీఎల్ఓలకు సూచించారు. ఓటరు జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఈఆర్వో సూచించారు.

# రైతులకు ఊరటనిచ్చిన వర్షం

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 23:** గత కొన్ని రోజులుగా సా గునీటి కోసం తలడిల్లి పోతున్న రైతాంగానికి ఆదివారం సాయంత్రం ఓ మోస్తరుగా కురిసిన వర్షం రైతులకు ఎంతో ఊరటనిచ్చింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా బండి ఆత్మకూరు మండల పరిధిలోని రామాపురం,లింగాపురం,జిసి పాలెం,బండి ఆత్మకూరు, నారాయణపురం, చిన్నదేవలాపురం, పెద్దదేవలాపురం, పరమటూరు, భోజనం,పార్నపల్లె మణికంఠపురం ప్రాంతాలలో వర్షం కురియడంతో రైతులు సంతోషపడుతున్నారు. ఎండిపోతున్న సాలు వరిమళ్లకు ఈ వర్షం కారణంగా సాలు వరికి జీవం పోసినట్లుగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. మరో రెండు రోజులపాటు అల్పపీడనం కారణంగా ఓ మోస్తరుగా వర్షాలు కురిస్తే బాగుంటుందని రైతులు ఊహించుకుంటున్నారు. సాగునీటికి ఆందోళన చెందుతున్న తరుణంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షం రైతులకు ఎంతో లాభదాయకంగా ఉందని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# భారత ఉపరాష్ట్రపతి నూజివీడు నియోజకవర్గంలో ఆదర్శమైన రైతులను గుర్తించి సన్మానించుట చరిత్రాత్మకం.





**దేశంలోనే నూజివీడు నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలిపిన రైతన్నలు అభినందనీయం, ఆదర్శనీయం.**

**భారత ఉపరాష్ట్రపతి పర్యటనకు వచ్చి, తిరిగి వెళ్ళేవరకు కన్నులు పండుగగా అధికారులు అప్రమత్తశీగా, అత్యంత బాధ్యతతో విధులు నిర్వహించాలి.**

**అధికారులు సమీక్ష సమావేశంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొని పలుసూచనలు జారీచేశారు.**

**రాష్ట్ర మంత్రితో పాటు ఐజిపి జి.వి.జి అశోక్ కుమార్, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి , జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమాలు సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్వరరావు,లి జిల్లా జాయింటు కలెక్టరు డా.యం. జె.అభిషేక్ గౌడ అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.శ్రావణ్ కుమార్ రెడ్డి కేంద్ర,రాష్ట్ర భద్రతా అధికారులు, పాప్ కార్నికా కంపెనీ ప్రతినిధులు.**

**ఏలూరు/ముసునూరు, బ్యూరో చీఫ్ ఆగస్టు 23: నంది పత్రిక** ముసునూరు మండలం ముసునూరు గ్రామంలో ఆదివారం 24వ తేదీ సోమవారం (రేపు) భారత ఉప రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లను పరిశీలించి, అధికారులతో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పరిశీలించారు. రాష్ట్ర మంత్రితో పాటు ఐజిపి జి.వి.జి.అశోక్ కుమార్, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమాలు సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్వర రావు, జిల్లా జాయింటు కలెక్టరు డా.యం జె.అభిషేక్ గౌడ,అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.శ్రావణ్ కుమార్ రెడ్డి, కేంద్ర, రాష్ట్ర భద్రతా అధికారులు పాల్గొన్నారు. అనంతరం గౌర్మెటు పాప్‌కార్నికా సంస్థ ఆవరణలో అధికారులతో మంత్రి కొలుసు పార్థసారథి సమీక్షించి, దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ భారత ఉప రాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్ ఈనెల 24వ తేదీ నూజివీడు నియోజకవర్గం ముసునూరు మండలం ముసునూరులోని గౌర్మెటు పాప్‌కార్నికా సంస్థ ఆధ్వర్యంలో నూతన పాప్‌కార్న్ సీడ్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. భారత ఉపరాష్ట్రపతితో పాటు రాష్ట్ర గవర్నరు, రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లు పాల్గొంటారని తెలిపారు. వీరితో పాటు పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పలువురు ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.ఈ సందర్భంగా పాప్‌కార్న్ ఉత్పత్తికి కృషిచేస్తున్న రైతులు, భాగస్వాములను భారత ఉపరాష్ట్రపతి సన్మానిస్తారని తెలిపారు. వివిధ పంటలు పండించడంలో భారతదేశంలోనే నూజివీడు నియోజకవర్గానికి గుర్తింపును, మంచి విజయాన్ని రైతన్నలు తీసుకొచ్చారని ఇది మంచి శుభపరిణామం అన్నారు. కొన్ని ప్రాంతాలు కొన్ని పంటలకే పరిమితమని, కాని నూజివీడు నియోజకవర్గం మామిడి, కొబ్బరి, వరి, పామాయిల్, కోకో, మొక్కజొన్న, అరటి, పొగాకు తదితర పంటలను రైతులు పండించి, నూజివీడు నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలిపారని రైతన్నలు అభినందనీయం, ఆదర్శనీయం మని అన్నారు. నూజివీడు నియోజకవర్గంలో గోర్ మెపాప్ కార్నియా ప్రవేటు లిమిటెడ్ కంపెనీ స్థాపించుట, పాప్ కార్నియాకు అనుకూలమైన మొక్కజొన్న పంటలు రైతులు పండించడం అభినందనీయం అన్నారు. దేశంలో వివిధరాష్ట్రాలకు మాల్స్, మల్టీప్లెక్స్, సినిమా థియేటర్లు, తదితర వాటికి ఇక్కడ ఉత్పత్తి చేసే పాప్ కార్నియాను పంపించి సేల్ అయ్యే విదంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. భారత ఉపరాష్ట్రపతి సభావేదికకు వచ్చే ప్రజలు, రైతులకు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యటన సజావుగా జరిగేలా ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ భారత ఉప రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లు పూర్తిచేశామని, చిన్న చిన్న పనులు ఉన్నను ఈ సాయంత్రం పూర్తిచేసి, ఫిట్ నెస్ సర్టిఫికెట్లతో పూర్తిస్థాయి నివేదికలు ఇవ్వాలని అధికారులకు ఆదేశించామని తెలిపారు. భారత ఉపరాష్ట్రపతి పర్యటనను దృష్టిలో పెట్టుకుని ఏక్కడ కూడా ఏఒక్క చిన్న పొరపాటు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. వివిధ శాఖలు అధికారులు కేటాయించిన పనులు పూర్తిచెయ్యుటలో నిమగ్నమై ఉన్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ సాయంత్రానికి పూర్తిచెయ్యాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశామని అన్నారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ రాష్ట్ర ఉపరాష్ట్రపతి పర్యటనను అసాధారణ భద్రతా ఏర్పాట్లను పూర్తిచేశామని తెలిపారు. హెలిప్యాడ్, కాన్వాయ్, పార్కింగు ప్లేస్లు, తదితర ప్రాంతాలు, భారత ఉపరాష్ట్రపతి పర్యటన ప్రదేశాలకు, అన్ని మార్గాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి జల్లెడ పట్టామని అన్నారు. పర్యటనలో ఏటువంటి అంతరాయం లేకుండా విజయవంతంగా సాగేందుకు భద్రతా ఏర్పాట్లును కట్టుదిట్టం చేశామని అన్నారు. పర్యటన పూర్తయ్యేంత అయ్యి, తిరిగి వెళ్ళే వరకు నిరంతరం భద్రతా చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, జిల్లా అటవీశాఖ అధికారి పి.వి.సంధీప్ రెడ్డి, జెడ్పీ సిఈవో పి.జగదాంబ, ఆర్& బి యస్ఇ కె.విజయరత్నం, పంచాయతీరాజ్ శాఖ యస్ఇ జెడ్.రమేష్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.యు.శోభ, గౌర్మెటు పాప్‌కార్నికా సంస్థ ప్రతినిధులు, వివిధ శాఖలు అధికారులు, పట్టణ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, రైతులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.





# ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు చిరస్మరణీయం...





## ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్

**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించి ఎన్నో సవాళ్లను అధిగమించి, ప్రజాసేవకు అంకితమై పనిచేసిన ధీరోదాత్తుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ప్రజలకు విశిష్ట సేవలందించారని పేర్కొన్నారు.స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనలోనూ ఆయన పోషించిన పాత్ర చరిత్రలో చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు, స్పెషల్ పార్టీ పోలీసులు, ఏఆర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల వివరాలు ప్రచురణ..

**చాగలమర్రి ఆగస్టు 23 నంది పత్రిక** మండలంలోని 19 గ్రామ పంచాయతీలలో పోలింగ్ కేంద్రాల వివరాలను ఆదివారం ఎంపీడీవో తాహి హుసేన్ తహసిల్దార్ ఫనీంద్రుడు ప్రచురించిన వివరాలు వివిధ కార్యాలయాల్లో ప్రదర్శించారు. 22 పోలింగ్ స్టేషన్లో, 132 గ్రామపంచాయతీ, వార్డులలో పోలింగ్ కేంద్రాల వివరాలను తెలియజేయడం జరిగింది. ప్రధాన కోడళ్ళలో ఉన్న కార్యాలయాల్లో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ, సీనియర్ అసిస్టెంట్ బాల నరసింహుడు, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ రాజకుమార్, పంచాయతీ బోర్డు సిబ్బంది షేక్షా తదితరులు ఉన్నారు.



## యాదావిధిగా నేడు (ఆగస్టు24న) జిల్లా, డివిజన్, మండల కేంద్రాల లో ప్రజా సమస్య ల పరిష్కార వేదిక

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం, ప్రతినిధి ఆగస్టు23 నంది పత్రిక.** జిల్లా ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంఆగస్టు 24వ తేదీన జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని డివిజన్ మరియు మండల కేంద్రాలలో నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారులి. అదేవిధంగా రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం కూడా నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సంబంధిత ఆధార పత్రాలతో సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అర్జీల స్వీకరణ, పరిశీలన మరియు పరిష్కార ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా మరియు మండల స్థాయి అధికారుల సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేయబడి నట్లు తెలిపారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను అధికారిక వెబ్‌సైట్ ఎవవనిశీయుఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ ద్వారా కూడా నమోదు చేసుకో వచ్చని తెలిపారు. అర్జీల స్థితి, పరిష్కార ప్రక్రియ లేదా ఇతర సమాచారం కోసం మీకోసం" టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100 ను సంప్ర దించవచ్చని సూచించారు. క్యూఆర్ కోడ్ ను ఉపయోగించుకొని మీరు పెట్టుకున్న అర్జీ నెంబర్ కి ఫీడ్ బ్యాక్ ఇస్తే, తదుపరి సంబంధిత అధికారి మిమ్మల్ని సంప్రది స్తారని అన్నారు. నడవలేని వారు, మంచానికే పరిమి తమైన వారు, తీవ్రమైన అనారో గ్యంతో బాధపడు తున్న వారిని పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలకు తీసుకు రాలవద్దని తెలిపా రు.అలాంటి వారి సమస్యలను కుటుంబ సభ్యులు లేదా ప్రతినిధుల ద్వారా తెలియ జేయవచ్చని పేర్కొన్నారు. పి.జి.ఆర్.ఎస్‌కు హాజరయ్యే ప్రజల కోసం తాగునీరు, అల్పాహారం, భోజనం వంటి సౌకర్యాలతో పాటు వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినట్లు తెలిపారు. అందిన అర్జీలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటా మని కలెక్టర్ స్పష్టం చేశారు.

## అధికారుల నిర్లక్ష్యంతో భూస్వామి అయిన నిరుపేద మహిళ



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 23:** రెవెన్యూ అధికారుల తప్పిదం కారణంగా ఓ నిరుపేద మహిళ భూస్వామి అయినట్లుగా రికార్డులలో నమోదు చేసి వారెవ్వా! అనిపించుకుంటున్నారు. ఈ తప్పిదం ఒకసారి జరిగిందంటే పొరపాటు అనుకోవచ్చు. రెండవసారి కూడా ఇదేవిధంగా ప్రవర్తిస్తే, దీన్ని పొరపాటు అనుకోవాలా అధికారుల నిర్లక్ష్యం అనుకోవాలా అన్న విషయాన్ని అధికారులే ఆత్మ విమర్శ చేసుకోవాల్సి ఉంది. బండి ఆత్మకూరుకు చెందిన సూ రం అరుణ అనే వితంతు మహిళకు సెంటు భూమి లేదు. సొంత ఇల్లు కూడా లేదు. ఆమె పేరుపై గత సంవత్సరంలో 154 ఎకరాలు, ప్రస్తుతం 115 ఎకరాలు భూమి ఉన్నట్లుగా ఆన్లైన్ రికార్డులలో నమోదు చేసి ఆమెను భూస్వామిని చేసేశారు. అధికంగా భూమి ఉందన్న సాకుతో ఆమె కుమార్తెకు అందాల్సిన తల్లికి వందనం పథకం గత రెండేళ్లుగా అందడం లేదు. ప్రస్తుతం అరుణ కుమార్తె జూనియర్ ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నప్పటికీ, పదో తరగతి సమయంలో కూడా తల్లికి వందనం పథకం అందలేదని అరుణ ఆరోపిస్తూ ఉంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమ కుటుంబానికి ఎలాంటి సంక్షేమ పథకాలు అందలేదని, సమస్యను పరిష్కరించమని గత రెండు సంవత్సరాల నుండి కార్యాలయ చుట్టూ చక్కర్లు కొడుతూ ఉన్నప్పటికీ అధికారులు మాత్రం ఏమాత్రం పట్టించుకోవడంలేదని బాధితురాలు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ స్పందించి తన పేరిట ఆన్లైన్లో ఉన్న భూములను తొలగించి, తమ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని బాధితురాలు విజ్ఞప్తి చేస్తూ ఉంది.

## నేడు కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ

**నంద్యాల బ్యూరో, ఆగస్టు 24(నంది పత్రిక)** జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి, ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ఈ నెల 24 వ తేదీ (సోమవారం) జిల్లా వ్యాప్తంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ ఎస్)" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందని తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులు వాటి పరిష్కారానికి చర్యలు చేపడతారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను నేరుగా కార్యక్రమంలో సమర్పించవచ్చని, అలాగే మీకోసం .ఏపీ .గవర్నమెంట్ .ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. సమర్పించిన అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. అర్జీదారులు తమ సమస్యలకు సంబంధించిన వినతులను ముందుగా మండల, రెవెన్యూ డివిజన్ లేదా మున్సిపల్ స్థాయి కార్యాలయాల్లో సమర్పించి, అక్కడ పరిష్కారం కాని అంశాలను మాత్రమే జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 10.00 గంటలకు ప్రారంభమయ్యే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.



# మన ఊరి భవిష్యత్తు మన చేతుల్లోనే






## ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ
## ఆళ్లగడ్డ అంటే అభివృద్ధి
## ఆళ్లగడ్డ అంటే యువతరం భవిష్యత్
## ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగష్టు 22, నంది పత్రిక** మన ఊరి భవిష్యత్తు మన చేతుల్లో అనే ఆస్క్ అఖిల ముఖా ముఖి కార్యక్రమానికి ఆళ్లగడ్డ యువతీ యువకులు తరలివచ్చి సొంత ప్రాంతంపై ఉన్న మమకారంతో ఆళ్లగడ్డ భవిష్యత్ ప్రగతి కోసం తమ ఆలోచనలను పంచుకోవడం ఎంతో హర్షణీయమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ వేదికగా ఆస్క్ అఖిల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ఆళ్లగడ్డలో కంపెనీల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థల ఆధునీకరణ వంటి మౌలిక వసతులపై ఎంతో పరిపక్వతతో కూడిన సలహాలు అందించారన్నారు. "మన ఆళ్లగడ్డ అభివృద్ధిలో మేమంతా భాగస్వాములవుతాం"

అంటూ యువత చూపిన చొరవ నిజంగా స్ఫూర్తిదాయకం అన్నారు. ఆళ్లగడ్డ అంటే వర్గ విభేదాలు అనే ముద్ర ఉండేదని, ఆ ముద్రను తుడిచిపెట్టి.. "ఆళ్లగడ్డ అంటే అభివృద్ధి ఆళ్లగడ్డ అంటే యువతరం భవిష్యత్తు" అనే సరికొత్త గుర్తింపును తీసుకురావడమే మనందరి లక్ష్యమని యువత అందించిన ప్రతి ఆలోచనను బాధ్యతగా స్వీకరించి నియోజకవర్గ ప్రగతికి బాటలు వేస్తామన్నారు. సొంత ఊరిపై ఉన్న ప్రేమతో విచ్చేసి తమ అమూల్యమైన ఆలోచనలను పంచుకున్న ప్రతి ఆళ్లగడ్డ యువతీ యువకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియ జెస్తున్నానని ఆమె తెలిపారు.








## గుంటూరులో సెప్టెంబర్ 1న జరిగే భారీ నిరసన కార్యక్రమానికి మద్దతు....
### రెవెన్యూ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలి...
### భూపతిరాజు రవీంద్ర రాజు....



**ఏలూరు, బ్యూరో చీఫ్ ఆగస్టు 23 నంది పత్రిక** సెప్టెంబర్ 1వ తేదీన గుంటూరులో జరగనున్న భారీ నిరసన కార్యక్రమానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్ర రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు అందరూ సెప్టెంబర్ 1న గుంటూరులో జరిగే భారీ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి. రాష్ట్రంలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు పెన్షన్ విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రిటైర్ అయిన తరువాత వారి పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. కుటుంబ సమస్యలు, హెల్త్ సమస్యలతో ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడుతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సిపిఎస్ ఉద్యోగులకు న్యాయం చేసి ఓపిఎస్ అమలు చేస్తామని మాట ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. సిపిఎస్ ఉద్యోగులకు న్యాయం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా మరియు ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తో చర్చించి వెంటనే చర్యలు చేపట్టాలి" అని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి పిఆర్సి కమిషన్ వెంటనే వేయాలని, ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ డిఏలు, సరెండర్ బకాయిలు, మెడికల్ రీయింబర్స్ మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## బంగారు చింతలపూడి నేడు ప్రజాదరణతో దద్దరిల్లింది!
### మినీ బస్ స్టాండ్ వద్ద వాటర్ ఫౌంటెన్ ను ప్రారంభించిన కూటమి నాయకులు

**ఏలూరు బ్యూరో చీఫ్ ఆగస్టు 23 నంది పత్రిక** ఏలూరు జిల్లా చింతలపూడి మినీ బస్ స్టాండ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్ ప్రారంభోత్సవం నేడు సినీ మ్యూజికల్ హంగామాతో అంగరంగ వైభవంగా జరిగింది,అభివృద్ధి పథంలో దూసుకు పోతు న్న చింతలపూడి నియోజకవర్గంలో ఈ ఫౌంటెన్ ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలవబో తోంది, చింతలపూడి శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ ఆధ్వర్యంలో, ఏలూరు జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి , బిజెపి, జనసేన నాయకులలి చేతుల మీదుగా ఈ వాటర్ ఫౌంటెన్ ప్రారంభమైంది. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్న ఎమ్మెల్యే సంక ల్పానికి ఈ వాటర్ ఫౌంటెన్ నిదర్శనమని, ప్రయాణికులకు, పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రారంభోత్సవానికి కూటమి నాయ కులు, కార్యకర్తలు, అధికారులు మరియు పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలతో మినీ బస్ స్టాండ్ పరి సరాలన్నీ కోలాహలంగా మారాయి. బంగారు చింతలపూడి గా మార్చడమే లక్ష్యం గాఎమ్మెల్యే రోషన్ కుమార్ చేస్తున్న అభివృద్ధి పనులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.





## ఆయుష్ రంగానికి సరికొత్త ఊతం..
### రాష్ట్ర మంత్రి సత్యకుమార్ చొరవకు ఫలితం



**అమరావతి, బ్యూరో చీఫ్ ఆగస్టు 23: నంది పత్రిక** రాష్ట్రంలో ఆయుష్ వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ చేస్తున్న నిరంతర కృషికి మరో కీలక ఫలితం లభించింది. 202627 ఆర్థిక సంవత్సరానికి రూ.185.75 కోట్లతో ఆంధ్రప్రదేశ్ సమర్పించిన వార్షిక కార్యాచరణ ప్రణాళిక కు కేంద్ర ఆయుష్ మిషన్ ఆమోదం లభించింది. జాతీయ ఆయుష్ మిషన్ ప్రారంభమైన తర్వాత రాష్ట్రానికి లభించిన అత్యధిక వార్షిక కేటాయింపు ఇదే కావడం విశేషం.మంత్రి సత్యకుమార్ కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేస్తూ, రాష్ట్రానికి మరిన్ని నిధులు, కొత్త ప్రాజెక్టులు, మెరుగైన ఆయుష్ సేవలు తీసుకురావడంలో చూపుతున్న చొరవకు ఈ ఆమోదం నిదర్శనంగా నిలుస్తోంది. 202425 నుంచి 202627 వరకు కేవలం మూడు సంవత్సరాల్లోనే రూ.434.64 కోట్ల ఆయుష్ నిధులకు కేంద్రం ఆమోదం లభించడం గత దశాబ్దంతో పోలిస్తే గణనీయమైన పురోగతి.గిరిజన, మారుమూల ప్రాంతాల్లో 19 మొబైల్ మెడికల్ యూనిట్లు, 64 ఆయుష్ డిస్పెన్సరీల ఆధునికీకరణ, 712 డిస్పెన్సరీలకు ఉచిత మందులు, 126 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు నిధులు, డీ-అడిక్షన్ కేంద్రాలు, యోగా వెల్నెస్ కేంద్రాలు, స్పెషాలిటీ వెల్నెస్ కేంద్రాలు, స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్, హైకోర్టుసచివాలయంలో ఆయుష్ క్లినిక్స్ వంటి అనేక కార్యక్రమాలకు ఈ ప్రణాళికలో ప్రాధాన్యత లభించింది.ఆయుష్ విద్యాసంస్థలు, ఆసుపత్రులు, డిజిటల్ సేవలు, టెలీమెడిసిన్, నేచురోపతి, యోగా, సంప్రదాయ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా ఈ నిధులు కీలకంగా ఉపయోగపడనున్నాయి.ఆయుష్ రంగాన్ని కేవలం సంప్రదాయ వైద్య విధానంగా కాకుండా, ఆధునిక ప్రజారోగ్య వ్యవస్థలో సమర్థవంతమైన భాగస్వామిగా తీర్చిదిద్దాలనే మంత్రి సత్యకుమార్ దృక్పథానికి ఈ భారీ కేటాయింపులు బలమైన గుర్తింపుగా నిలుస్తున్నాయి.రాష్ట్రానికి ఇంతటి స్థాయిలో నిధులు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి సత్యకుమార్ ఆయుష్ సేవలను మరింత విస్తరించి ప్రతి వర్గానికి నాణ్యమైన, అందుబాటులో ఉండే ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. కేంద్రంతో సమన్వయం.. రాష్ట్ర ప్రయోజనాల కోసం నిరంతర కృషి.. ఆయుష్ రంగానికి కొత్త దిశ.. మంత్రి సత్యకుమార్ చొరవకు మరో విజయగాథ

## ఈ నెల 31వ తేదీన జరిగే ముఖ్యమంత్రి వెలుగొండ ప్రాజెక్ట్ పర్యటనను విజయవంతం చేయండి-
### ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి

**మార్కాపురం బ్యూరో చీఫ్ ఆగస్ట్ 23 నంది పత్రిక** ఈనెల 31వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్టు పర్యటన విజయంతం చేయాలని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నాడు మార్కాపురం పట్టణంలో జవహర్ నగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల తెలుగుదేశం నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 31వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యులు నారా చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్టు నుండి నల్లమల్ల సాగర్ కు నీటి విడుదల చేయడానికి విచ్చేస్తున్నారని ఈ సందర్భంగా మార్కాపురం నియోజకవర్గంలోని అన్ని మండలాల, రెండు మున్సిపాలిటీల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు వేలాదిగా విచ్చేసి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే మార్కాపురం జిల్లా ప్రకటించాము అని, నియోజకవర్గంలోకి ప్రతి ఇంటికి పైప్లైన్ తీసుకు వచ్చామని త్వరలో దాన్ని పూర్తిచేసి ప్రతి ఇంటికి కృష్ణానది జలాలను అందిస్తామని అన్నారు. హార్టికల్చర్ హబ్ ద్వారా మార్కాపురం జిల్లాకి త్వరలో ఐదు వేల కోట్ల నిధులు రాబోతున్నాయని తద్వారా ఈ ప్రాంతం సమూలంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



## సాగునీటిని వెంటనే విడుదల చేయాలి
### మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి..



**మహానంది, ఆగస్టు 23 (నంది పత్రిక):-** తెలుగుగంగ కాలువలకు సాగునీరు విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి డిమాండ్ చేశారు.ఆదివారం మహానంది లోని కుమ్మరి శాలివాహన సత్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ.. ఖరీఫ్ సమయం ముగిసిపోతుందని రైతులు ఆందోళన చెందుతుంటే పాలకులు మాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.రైతు సంక్షేమం అంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతు వ్యతిరేకి ప్రభుత్వంగా మారిపోయిందని అన్నారు. ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకొని కనీసం ఖరీఫ్ సీజన్ లో కూడా నీళ్లు ఇవ్వలేని ప్రభుత్వం దుర్మార్గమైన పాలన కొనసాగిస్తుందని అన్నారు.శ్రీశైలం డ్యాంలో నీళ్లు ఉన్నప్పటికీ, రైతులకు ఎందుకు నీళ్లు ఇవ్వలేకపోతున్నారో నాయకులు సమాధానం చెప్పాలన్నారు. తను అధికారంలో ఉన్నప్పుడు మహానంది పుణ్యక్షేత్రంలో అభివృద్ధి చేసిన ఘనత తనదే అన్నారు.శిల్పా అంటేనే మహానంది మండలం అనిపించుకున్న మండలం ఇది అని నన్ను దూరం చేశారని భావోద్వేగానికి గురయ్యారు. ప్రభుత్వ, తన సొంత నిధులతో మండలాన్ని అభివృద్ధి చేశారన్నారు. రాష్ట్రంలో ప్రతి నిరుద్యోగికి రూ.3 వేలు ఇస్తానంటూ మోసం చేసింది చంద్రబాబు నాయుడు కదా అని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తెలుగు గంగ కాలువలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.రైతులకు కనీసం సాగునీరు అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.వర్షాలు లేక నారుమడులు ఎండిపోతున్నాయని,మరో వారం రోజులు వర్షాలు కురవకపోతే శ్రీశైలం నియోజకవర్గంలోని రైతులకు కోట్లాది రూపాయల మేర తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.బండి ఆత్మకూరు మండలంలోని ఈర్నపాడు,లింగాపురం,పార్నపల్లె తదితర గ్రామాల్లో స్వయంగా పర్యటించి రైతుల దీనస్థితిని పరిశీలించానని తెలిపారు.పంటలకు సాగునీరు లేకపోవడమే కాకుండా,కనీసం పశువులకు తాగునీరు అందని దయనీయ పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వర్ రెడ్డి,రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి కొండా మధుసూదన్ రెడ్డి, వైయస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఓం శాంతి కార్యాలయంలో విశ్వ బంధుత్వ దినోత్సవం.



**బేతంచెర్ల ఆగస్టు 23 ( నంది పత్రిక ).** బేతంచెర్ల పట్టణంలోగల ఓంశాంతి కార్యాలయంలో,విశ్వ బంధుత్వ దినోత్సవంను పుర స్కరించుకొని,రక్త దాన శిబిరంను నిర్వహించడ మైనది. రక్తదానం ప్రాణ దానంతో సమానం అని సామాజిక వేత్త గౌరి హుసేన్ రెడ్డి, ఎస్సై కేశవ రెడ్డి అన్నారు. రక్త దాన శిబిరానికి యువకులు, మహిళలు స్వచ్ఛందంగా కదలి వచ్చి, వారి రక్తమును దానం చేశారు. ఈ కార్యక్రమం లో బ్రహ్మ కుమారీలు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో రోటరీ క్లబ్ సేవలు అమోఘం
### రోటరీ క్లబ్ అధ్యక్షులు పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 23 నంది పత్రిక** అంతర్జాతీయ స్థాయిలో రోటరీ క్లబ్ సేవలు అమోఘమని ఆళ్లగడ్డ రోటరీ క్లబ్ అధ్యక్షులు పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి అన్నారు. రోటరీ క్లబ్ సాధారణ సమావేశం ఆదివారం నాడు పట్టణంలోని రోటరీ క్లబ్ సమావేశం మందిరంలో క్లబ్ అధ్యక్షుడు పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రార్థన గీతంతో మొదలైంది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవే పరమావధిగా అంతర్జాతీయ జాతీయ స్థాయిలో రోటరీ క్లబ్ సేవలు అమోఘంగా ఘనంగా నిర్వహిస్తున్నారని అలాగే ఆళ్లగడ్డ రోటరీ క్లబ్ సేవలు ఆళ్లగడ్డలో రోటరీ క్లబ్ స్థాపించినప్పటి నుండి నిర్విరామంగా సేవా కార్యక్రమంలో ముందుందని వారందరూ స్ఫూర్తితో తాము కూడా ఆళ్లగడ్డ రోటరీ క్లబ్బును అంచలంచెలుగా సేవా దృక్పథంతో నడిపించేందుకు రోటరీ క్లబ్ పెద్దలు అందరి సహాయ సహకారాలతో తాము కృషి చేస్తామని 26,27న కార్యక్రమాలు ఉన్నాయని ఆయన అన్నారు. రోటరీ క్లబ్ పూర్వపు అధ్యక్షులు మాజీ ప్రిన్సిపాల్ శంకర్ రెడ్డి ప్రముఖ వ్యాపారవేత టీఎంసీ వేణుగోపాల్ రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ కెవి సుబ్బారెడ్డి, ప్రసంగించారు. అనంతరం డిస్టిక్ గవర్నర్ కేశవరెడ్డిజన్మదిన సందర్భంగా రోటరీ సభ్యులందరూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు, ఆనవాయితీ ప్రకారం సమావేశంలో రోటరీ క్లబ్ లక్కీ డ్రిప్ తీయగా మొదటి బహుమతి సెక్రటరీ గాండ్ల చంద్రసేన రెండవ బహుమతి కెవి సుబ్బారెడ్డి కి అందజేశారు. ఈ సమావేశంలో మా టీవీ ప్రసాద్ ,బండారు దస్తగిరి, రేపాకుల శ్రీనివాసులు పాల్గొన్నారు

## మంచి నీటి పైపు పగిలి కలుషిత మవుతున్న నీరు.



**బేతంచెర్ల ఆగస్టు 23 ( నంది పత్రిక ).** బేతంచెర్ల మండలం ముద్దవరం గ్రామములోని గొల్ల పేట యందు, మంచినీటి పైపు పగిలి పోయినది. పగిలిన పైపు మురుగు నీరు కాలువకు అ త్యంత దగ్గరలో ఉన్నందు వల్ల, తాగు నీరు కలుషితమై, కాలనీ వాసులు జ్వరము,జలుబు, దగ్గు,గొంతు నొప్పు లతో బాధ పడుతున్నారు.గ్రామ పంచాయితీ అధికారుల దృష్టికి, ఈ సమస్యను చెప్పినా పట్టించు కోవడం లేదు. వెంటనే ఈ సమస్యను మండల అధికారులు వెంటనే జోక్యం చేసుకొని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

# సెట్టూరు ఎస్సీ బాలుర వసతిగృహంలో విద్యార్థి మృతి

### జిల్లా వ్యాప్తంగా ఎస్సీ వసతిగృహాలపై అధికారుల నిర్లక్ష్యానికి ఇకనైనా ముగింపు పలకాలి

**అనంతపురం బ్యూరో చీఫ్ ఆగస్టు 23 నంది పత్రిక** అనంతపురం జిల్లా, సెట్టూరు మండల కేంద్రం సెట్టూరు మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో పహరీ గోడ కూలి విద్యార్థి మృతి చెందిన ఘటన అత్యంత విషాదకరం, తీవ్ర ఆందోళనకరం. విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందా అనే అంశంపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది.ఇది ఒక్క సెట్టూరు ఎస్సీ బాలుర వసతిగృహానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు. అనంతపురం జిల్లాలోని అనేక ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతిగృహాలు, ఎస్సీ విద్యార్థుల వసతి గృహాలు, పాఠశాల భవనాలు, పహరీ గోడలు శిథిలావస్థకు చేరుకున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దళిత, గిరిజన ప్రజాసంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఎస్సీ విద్యార్థుల భద్రత, వసతిగృహాల నిర్వహణ విషయంలో ఎస్సీ సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు మాత్రమే కాకుండా జిల్లా స్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్ గారు సైతం తగినంత శ్రద్ధ చూపడం లేదని ప్రజాసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.వసతిగృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యార్థుల తల్లిదండ్రులు, దళిత గిరిజన ప్రజాసంఘాల నాయకులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్యలను పరిష్కరించకపోవడం అత్యంత బాధ్యతారాహిత్యమని వారు మండిపడుతున్నారు.విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదం ఉందని ముందుగానే తెలిసినా అధికారులు స్పందించకపోతే, ప్రమాదం జరిగిన తర్వాత బాధ్యత ఎవరిది? ఒక విద్యార్థి ప్రాణం పోయిన తర్వాత స్పందించడం కాదు విద్యార్థి ప్రాణం పోకుండా ముందుగానే రక్షణ చర్యలు తీసుకోవడమే అధికారుల అసలైన బాధ్యత.జిల్లా వ్యాప్తంగా అన్ని ఎస్సీ వసతిగృహాలను తనిఖీ చేయాలి సెట్టూరు ఘటన నేపథ్యంలో అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతిగృహాలు, ఎస్సీ విద్యార్థుల వసతిగృహాలు, పాఠశాల భవనాలు, పహరీ గోడలను తక్షణమే తనిఖీ



చేయాలి.శిథిలావస్థలో ఉన్న భవనాలు, పహరీ గోడలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలి. విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదకరంగా ఉన్న భవనాల్లో వారిని కొనసాగించకుండా ప్రత్యామ్నాయ వసతి కల్పించాలి.

**మృత విద్యార్థి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి** సెట్టూరు ఎస్సీ బాలుర వసతిగృహంలో పహరీ గోడ కూలి మృతి చెందిన విద్యార్థి కుటుంబం తీవ్ర విషాదంలో ఉందని, మృత విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి అందించాలని దళిత, గిరిజన ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా ప్రభుత్వ సహాయం అందించాలని, కుటుంబానికి న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

**జిల్లా కలెక్టర్ నుంచి క్షేత్రస్థాయి అధికారుల వరకు బాధ్యత నిర్ధారించాలి**

సెట్టూరు ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడానికి ఉన్నతస్థాయి విచారణ జరపాలి. గతంలో వసతిగృహాల దుస్థితిపై ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? సంబంధిత అధికారులు ఎప్పుడు తనిఖీలు నిర్వహించారు? ప్రమాదకర నిర్మాణాలను గుర్తించినప్పటికీ ఎందుకు మరమ్మతులు చేయలేదు? అనే అంశాలను విచారణలో తేల్చాలి. ఎస్సీ విద్యార్థుల వసతిగృహాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు ఎవరైనా సరే, వారి స్థాయిని చూడకుండా బాధ్యతను నిర్ధారించి కఠినమైన శాఖాపరమైన, అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.జిల్లాలోని ఎస్సీ విద్యార్థుల భద్రతను విస్మరించి, వసతిగృహాల దుస్థితిని పట్టించుకోకుండా అధికారులు వ్యవహరిస్తే ఇకపై దళిత, గిరిజన ప్రజాసంఘాలు చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని నాయకులు హెచ్చరిస్తున్నారు.

**విద్యార్థుల ప్రాణాలు అధికారుల నిర్లక్ష్యానికి బలికావడానికి వీల్లేదు.**

మృత విద్యార్థి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి.జిల్లాలోని అన్ని ఎస్సీ వసతిగృహాలకు తక్షణ భద్రతా తనిఖీలు నిర్వహించాలి.శిథిలావస్థలో ఉన్న భవనాలు, పహరీ గోడలను వెంటనే మరమ్మతు చేయాలి.

**సెట్టూరు ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరపాలి.**

నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇవే దళిత, గిరిజన ప్రజాసంఘాల నాయకుల ప్రధాన డిమాండ్లు.



# వివిఐపి పర్యటనలు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పూర్తిచేసి విజయవంతం చెయ్యాలి.





### ఏక్కడ కూడా చిన్న పొరపాట్లకు తావులేకుండా, గత అనుభవాలను బేరీజు వేసుకుని అప్రమత్తంగా విధులు నిర్వహించాలి. శాఖలు వారీగా కేటాయించిన పనులుపై సమీక్షించి, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి దిశానిర్దేశం చేశారు.

**ఏలూరు/ముసునూరు, బ్యూరో చీఫ్ ఆగస్టు 23: నంది పత్రిక** ముసునూరు మండలం ముసునూరు యంపిడివో కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం సాయంత్రం ముసునూరు మండలం (రేపు) సోమవారం నాడు భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నరు ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటి,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్యటనలు సంబంధించి శాఖలు వారీగా కేటాయించిన పనులుపై జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సుదీర్ఘంగా సమీక్షించారు. జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ,అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.శ్రావణ్ కుమార్ రెడ్డి,సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ వివిఐపి పర్యటనలు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పూర్తిచేసి విజయవంతం చెయ్యాలని, ఏక్కడ కూడా చిన్న పొరపాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తిచెయ్యాలని ఆదేశించారు. శాఖలు వారీగా కేటాయించిన పనులను ఒకటికి నాలుగు సార్లు పరిశీలించిన అనంతరం ఫిట్ నెస్ సర్టిఫికెట్లు, పూర్తిస్థాయి నివేదికలు అందజేయ్యాలని అన్నారు. పర్యటన కాన్వాయ్ లు, సభా ప్రాంగణాలు, పార్కింగు, బారికేడింగు, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుధ్యం, నిరంతరాయంగా విద్యుత్తు, జనరేటర్లు, వైద్య, అగ్నిమాపక తదితర ఏర్పాట్లను శాఖలు వారీగా సమీక్షిస్తూ, సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. భద్రతా పరంగా, ఏర్పాట్లు పరంగా ఎలాంటి లోపాలకు తావులేకుండా తదితర శాఖలు అధికారులు సమన్వయంతో పనిచెయ్యాలని ఆదేశించారు. కేటాయించిన విధులు పట్ల అధికారులు బాధ్యతగా, ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లను పూర్తిచెయ్యాలని తెలిపారు. హనుమాన్ జంక్షన్ నుండి ముసునూరు మండలం సభాస్థలి వరకు పశువులు, మూగజీవాలు కాన్వాయ్ లకు అడ్డు తగలుకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లో టామ్ టామ్ లు వేయించి, ఆయా యజమానులకు అవగాహన కల్పించి ప్రత్యేక దృష్టిపెట్టాలని అన్నారు. అలాగే ఆ సమయంలో ఏపీఎస్ఆర్టీసీ బస్సులను ప్రత్యామ్నాయంగా వేరే రూటుకు మళ్లించాలని, ఇందులో ఏ ఒక్క చిన్న పొరపాటుకు ఆస్కారం లేనివిధంగా పక్కాగా అమలు చెయ్యాలని అన్నారు. వీవీఐపీ పర్యటనలకు సంబంధించిన ప్రతి అంశాన్ని సీరియస్ తీసుకుని, నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టి వివిఐపిలు తిరిగి వెళ్లేవరకు అధికారులు అప్రమత్తంగా, అత్యంత బాధ్యతతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టరు అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా, డివిజన్, మండల వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

# బాహుబలి జేసీబీతో గచ్చిబౌలిలో ప్రమాదకర భవనం కూల్చివేసిన హైడ్రా

రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని ఆంజనేయ నగర్‌లో శనివారం ఓ ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన నేపథ్యంలో, దాని పక్కనే ప్రమాదకరంగా మారిన మరో బహుళ అంతస్తుల భవనాన్ని అధికారులు కూల్చివేశారు. సీఎంసీ (సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్), హైడ్రా బృందాలు సంయుక్తంగా ఆదివారం ఉదయం ఈ ఆపరేషన్ చేపట్టాయి. శనివారం సాజిద్ అనే వ్యక్తికి చెందిన భవనం కూలిపోవడంతో, దాని శిథిలాలు పక్కనే ఉన్న మరో ఏడంతస్తుల భవనంపై పడ్డాయి. దీంతో ఆ భవనం కూడా తీవ్రంగా దెబ్బతిని, ఏ క్షణమైనా కూలిపోయే స్థితికి చేరింది. ఈ నిర్మాణం వల్ల చుట్టుపక్కల భవనాలకు, ప్రజలకు పెను ప్రమాదం పొంచి ఉందని సీఎంసీ అధికారులు నిర్ధారించారు. వారి అభ్యర్థన మేరకు హైడ్రా బృందాలు రంగంలోకి దిగి కూల్చివేత పనులను ప్రారంభించాయి. ఈ భవనాలు అత్యంత సమీపంలో, ఎలాంటి ఖాళీ స్థలం లేకుండా నిర్మించడంతో కూల్చివేత సవాలుగా మారింది. 'బాహుబలి' జేసీబీ వంటి భారీ యంత్రాలను ఉపయోగిస్తూ, సమీపంలోని ఇతర నిర్మాణాలకు ఎలాంటి నష్టం కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కూల్చివేత నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా, సమీపంలోని స్టెర్లింగ్ వైట్‌ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌లోని నివాసితులను ఇళ్లు ఖాళీ చేయించారు. ఆ ప్రాంతంలోకి ప్రజలు రాకుండా పోలీసులు



పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆంజనేయ నగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా కేవలం 50 గజాల స్థలంలోనే ఏడంతస్తుల వరకు పేకమేడల్లా భవనాలు నిర్మించారని అధికారులు తెలిపారు. ఈ అక్రమ నిర్మాణాలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా పరిణమించడంతో కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఈ ఘటనతో అక్రమ నిర్మాణాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నట్లు స్పష్టమవుతోంది.

## భర్తకు తెలియకుండా 8 ఏళ్లుగా పొదుపు.. రూ.12 లక్షలు ఎలుకలు తినేశాయి!

### యూపీలో విచారకర ఘటన
### భర్తకు తెలియకుండా, పెట్టెలో డబ్బు దాచుకున్న మహిళ
### బంగారం కొనాలని నిర్ణయం
### పెట్టె తెరిచి చూస్తే ముక్కలైన నోట్లు



ఉత్తరప్రదేశ్‌లో ఓ వింత ఘటన వెలుగులోకి వచ్చింది. భర్తకు తెలియకుండా ఓ మహిళ ఎనిమిదేళ్లుగా కూడబెట్టిన లక్షల రూపాయల నగదు ఎలుకల పాలైంది. బంగారం కొనుగోలు చేద్దామని ఆశతో దాచుకున్న ఆ డబ్బు, చివరకు చిత్తుకాగితాలుగా మారడంతో ఆ కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది.వివరాల్లోకి వెళితే, యూపీలోని గోండా జిల్లాకు చెందిన ఓ మహిళ, ఇంటి ఖర్చుల నుంచి కొద్దికొద్దిగా డబ్బు పక్కన పెడుతూ వచ్చింది. అలా సుమారు ఎనిమిదేళ్లలో రూ.12 లక్షల వరకు పొదుపు చేసింది. ఈ విషయం తన భర్తకు కూడా తెలియకుండా జాగ్రత్తపడింది. ఈ డబ్బును ఓ ట్రంకు పెట్టెలో భద్రపరిచింది. ఇటీవల, ఆ డబ్బుతో బంగారం ఆభరణాలు కొనాలని నిర్ణయించుకుంది. దీంతో ఎంతో ఆశతో ట్రంకు పెట్టెను తెరిచింది. కానీ లోపల దృశ్యం చూసి ఆమెకు గుండె ఆగినంత పనైంది. కరెన్సీ నోట్ల కట్టలను ఎలుకలు ముక్కలు ముక్కలుగా కొరికి పడేశాయి. చాలా నోట్లు పూర్తిగా నాశనమయ్యాయి. కుటుంబ సభ్యులు ఆ చిరిగిన నోట్ల మధ్యలోంచి పనికొచ్చేవాటిని వేరుచేసేందుకు ప్రయత్నించినా, పెద్ద మొత్తం నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో, ముఖ్యంగా ఎక్స్ లో వైరల్ అయింది. చిరిగిన నోట్ల కట్టలను చూసి నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో పెద్ద మొత్తంలో నగదు దాచుకోవడం ఎంత ప్రమాదకరమో ఈ ఘటన తెలియజేస్తోంది. దొంగతనం, అగ్నిప్రమాదం, తేమ లేదా ఎలుకల వంటి వాటి వల్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, డబ్బును బ్యాంకు ఖాతాల్లో దాచుకోవడం సురక్షితమని ఈ ఉదంతం మరోసారి స్పష్టం చేసింది.

## ఇంగ్లండ్ పేస్ బౌలర్ కు బేడీలు వేసి తీసుకెళ్లిన పోలీసులు



పాకిస్థాన్‌తో టెస్ట్ సిరీస్‌కు ముందు ఇంగ్లండ్ జట్టులో కలకలం రేగింది. ఆ జట్టు ఫాస్ట్ బౌలర్ బ్రైడన్ కార్స్‌ను పోలీసులు బేడీలతో అదుపులోకి తీసుకున్న ఘటన కొంచెం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం (ఆగస్టు 22) రాత్రి డెర్బీలోని ఓ నైట్‌క్లబ్ వెలుపల ఈ సంఘటన చోటుచేసుకుంది. దీనిపై ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) విచారణకు ఆదేశించింది. వివరాల్లోకి వెళితే.. డెర్బీలోని 'మోలీ మలోన్స్ ఐరిష్ టావెర్న్' అనే నైట్‌క్లబ్ వెలుపల నలుగురు పోలీసులు కార్స్‌ను చుట్టుముట్టి చేతులకు బేడీలు వేస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. అదే సమయంలో తోటి ఇంగ్లండ్ ఆటగాడు మాథ్యూ పాట్స్ అతడితో మాట్లాడుతుండగా, ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్ కూడా ఆ వీడియోలో కనిపించడం గమనార్హం. అయితే పోలీసులు కార్స్‌ను అరెస్ట్ చేయలేదని, కొద్దిసేపటికే విచారించి ఎలాంటి అభియోగాలు నమోదు చేయకుండా విడుదల చేశారని తెలిసింది. క్లబ్ నుంచి బయటకు వచ్చి తిరిగి లోపలికి వెళ్లే క్రమంలో బౌన్సర్లతో వివాదం జరగడమే ఈ గొడవకు కారణమని సమాచారం. పాకిస్థాన్‌తో జరిగిన తొలి టెస్టులో కార్స్ జట్టులో ఉన్నప్పటికీ తుది జట్టులో అవకాశం దక్కలేదు. దీంతో అతడిని కౌంటీ క్రికెట్ ఆడేందుకు ఈసీబీ అనుమతించింది. డర్హమ్ తరఫున ఆడిన మ్యాచ్‌లో కార్స్ రెండు వికెట్లు తీశాడు. ఈ ఘటనపై ఈసీబీ స్పందిస్తూ, "డెర్బీలో జరిగిన సంఘటన మా దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ జరుపుతున్నాం. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తాం" అని తెలిపింది. ఆగస్టు 27 నుంచి లార్డ్స్‌లో ప్రారంభం కానున్న రెండో టెస్టుకు ప్రకటించిన ఇంగ్లండ్ జట్టులో కార్స్ సభ్యుడిగా ఉన్నాడు. గతంలో బెట్టింగ్ సంబంధిత కార్యకలాపాల కారణంగా కార్స్ మూడు నెలల నిషేధాన్ని ఎదుర్కొన్నాడు. బ్రైడన్ కార్స్ ఐపీఎల్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ టీమ్ కు ప్రాతినిధ్యం వహిస్తాడన్న సంగతి తెలిసిందే.

## సీనియర్ ఐఏఎస్ ఇంట పెళ్లి సందడి.. హాజరైన మంత్రి నారా లోకేశ్



సీనియర్ ఐఏఎస్ అధికారి కె. కన్నబాబు కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్‌లోని వట్టినాగులపల్లిలో ఉన్న ఈవెంతారా కన్వెన్షన్‌లో కన్నబాబు కుమారుడు రితేష్ సూర్య ప్రీతమ్, హిమ ఐశ్వర్యల వివాహ రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు హాజరైన మంత్రి నారా లోకేశ్, వేదికపైకి వెళ్లి నూతన దంపతులను మనసారా ఆశీర్వదించారు. వారికి పుష్పగుచ్ఛం అందించి, ఉజ్వల భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కన్నబాబు కుటుంబ సభ్యులతో మంత్రి లోకేశ్ కాసేపు ముచ్చటించారు. ఈ వివాహ వేడుకకు పలువురు రాజకీయ, అధికార ప్రముఖులు కూడా హాజరై వధూవరులను ఆశీర్వదించాకరు. మంత్రి నారా లోకేశ్ రాకతో వేడుక ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com